Pubilshed from Ananthapuramu

PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 03 Vol.No : 03 | సంచిక : 172 Issue No : 172 | ఆదివారం Sunday | ఫిబ్రవరి 22, 2026 22 FEBRUARY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



యువతులతో భారతీయుల క్లబ్బులు,

## బార్లపై దాడులు..

### జైషే అంతర్జాతీయ కుట్ర!

- భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర
- పబ్‌లు, క్లబ్బుల్లో దాడులకు యువతులను నియమించుకుంటున్న ఉగ్రసంస్థ
- పాక్ ప్రమేయం బయటపడకుండా విదేశీ మహిళల నియామకం
- గాజా సహాయం పేరుతో దాడులకు భారీగా నిధుల సేకరణ
- ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరపాలని ప్లాన్

న్యూఢిల్లీ : పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జీవిఎం) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు.

- మిగతా 2లో..

ప్రజాభూమి ప్రతినిధి,వినుకొండ : తిరుమల లడ్డూ ప్రసాదంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారంపై సీఎం చంద్రబాబు మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ సంస్థపై వైసీపీ నిందలు వేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో నిందితుల్ని నడి రోడ్డుపై నిలబెడతామని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. 2024లో అధికారంలోకి వచ్చాక ప్రక్షాళన ప్రారంభించామని అన్నారు. నెయ్యి నమూనాలను నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకు పంపిస్తే కల్తీ జరిగినట్లు నివేదిక అందించిందని.. అది అసలు నెయ్యి కాదని తేలిందని స్పష్టం చేశారు.

# వాళ్ళది రోజుకో రాజకీయం





### అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా అది బూతుల పార్టీనే

- కల్తీ నెయ్యి నిందితులను నడి రోడ్డుపై నిలబెడతాం
- కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ పై నిందలు
- రాష్ట్రాన్ని కాపాడుకోడానికి ప్రజలూ కలిసి రావాలి.
- వినుకొండ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

2 లో

రసాయనాలతో నెయ్యి తయారు చేసి ప్రసాదంలో వినియోగించినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం సెట్ తన నివేదికలో కూడా పేర్కొందని స్పష్టం చేశారు. వినుకొండలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రజా వేదిక బహిరంగ సభలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. గత పాలకులు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అత్యంత నాసిరకంగా తయారు చేయించారని..2024 కంటే ముందు తిరుమల దర్శనానికి వెళ్లిన వారంతా ఈ అంశాన్ని గుర్తించారని అన్నారు. శ్రీవారి ప్రసాద పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదని అలాంటి ప్రసాదాన్ని గత పాలకులు అపవిత్రం చేశారని వ్యాఖ్యానించారు.

## ఆర్ఎస్ఎస్ పరువు నష్టం కేసు

### నేడు భివాండీ కోర్టు ముందు హాజరుకానున్న రాహుల్



ముంబయి : 2014 ఆర్ఎస్ఎస్ పరువు నష్టం కేసులో నేడు భివాండీ అదనపు సెషన్స్ కోర్టు ముందు లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ముంబయికి చేరుకున్నారు. దీంతో భివాండీలోని స్థానిక యంత్రాంగం భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసింది. ఈ కేసులో గతంలో మాజీ కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్ రాహుల్‌గాంధీకి బెయిల్ కోసం పూచీకత్తుగా వ్యవహరించారు. ఇటీవలే ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణం తర్వాత ఇప్పుడు మరలా నేడు కోర్టు ముందు రాహుల్‌కి పూచీకత్తు సమర్పించాల్సి ఉంది. కాగా, 2014 ఎన్నికల సమయంలో మార్చి 6వ తేదీన జరిగిన ర్యాలీలో రాహుల్ ఆర్ఎస్ఎస్‌పై తీవ్రంగా విమర్శించారు. ఆర్ఎస్ఎస్ జాతిపిత మహాత్మాగాంధీని హత్య చేసిందని వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలపై ఆర్ఎస్ఎస్ కార్యకర్త రాజేష్ కుంటే ఆయనపై కేసు నమోదు చేశారు.

- మిగతా 2లో..

## నేతన్నకు వెంకన్న దీవెన

- ఆప్కోతో టీటీడీ ఒప్పందం
- ఆర్డర్ జారీచేసిన టీటీడీ మార్కెటింగ్ అధికారులు
- కండువాలు, దుశ్శాలువాలు, ఇతర వస్త్రాల పంపిణీ చేయాలని ఆర్డర్
- ఆప్కో చరిత్రలో తొలిసారి టీటీడీ ఆర్డర్ రాక
- నేతన్నలకు 365ల రోజుల ఉపాధి కల్పనలో మరో ముందుడుగు
- చేనేతలకు మేలు కలిగేలా టీటీడీ ఆర్డర్ : మంత్రి సవిత హర్షం
- టీటీడీ పాలకమండలికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి

2 లో..



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : చేనేత రంగ అభివృద్ధికి, ఆప్కో బలోపేతానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. నేతన్నలకు 365 రోజులు ఉపాధి కల్పన లక్ష్యంగా పలు సంస్థలతో ఆప్కో ఒప్పందం చేసుకుంటోంది. దీనిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)తోనూ ఆప్కో ఒప్పందం చేసుకుంది. కలియుగ దైవం తిరుమల తిరుపతి వెంకన్న స్వామిని దర్శించుకునే భక్తులకు వేదాశీర్వచనంలో అందజేసే కండువాలు, దుపట్టాలు, కాటన్ బ్లౌజ్ లు టీటీడీకి సరఫరా చేయడానికి ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు టీటీడీ మార్కెటింగ్ శాఖ నుంచి ఆర్డర్ కాపీ ఆప్కోకు వచ్చింది. టీటీడీ నుంచి ఆప్కోకు ఇటువంటి ఆర్డర్ ఇదే మొదటిసారి కావడం విశేషం.

తిరుమల తిరుపతి వెంకన్న దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారిలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సైతం ఉంటున్నారు. తిరుమలకు విచ్చేసే వీఐపీలకు వెంకన్న ప్రత్యేక దర్శనంతో వేద పండితులు వేదాశ్వీరచనం కూడా అందజేస్తుంటారు. వేదాశీర్వచనం చేసే సమయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, స్వామి చిత్ర పటంతో పాటు కండువాలు, దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు అందజేయడం సంప్రదాయంగా వస్తోంది. దీనిలో భాగంగా కండువాలు, దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు సరఫరా చేయాలని ఆప్కోకు టీటీడీ



## కార్లతో ర్యాలీ..

- అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు

ప్రజాభూమి ప్రతినిధి, గుంటూరు : మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు.18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు.

- మిగతా 2లో..

# మీ ఆనందమే నా ఆనందం..

### సంక్షేమం అమలులో ఏపీకి దరిదాపుల్లో ఏ రాష్ట్రమూ రాదు

- మార్చి నెలాఖరుకు అన్ని పంచాయతీల్లో 100 శాతం చెత్త సేకరణ
- ఢిల్లీ ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం
- చెత్త విషయంలో జపాన్ తరహాలో అలవాట్లు మార్చుకోవాలి
- వినుకొండ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,వినుకొండ :

పేద ప్రజల ఆదాయాన్ని పెంచి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతామని... ప్రతి ఒక్కరికి ఆనందం పంచేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు ఆదాయం పెంచే మార్గాన్ని నేర్పించి వారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషన్ వేరు**

వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...'పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషనే వేరుగా ఉంటుంది. ఇటీవల కోటప్పకొండలో శివరాత్రి ఉత్సాహంగా జరిగింది. భక్తులతో దద్దరిల్లింది. కోటప్పకొండ తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు.

2 పేజీలో..





## అల్పపీడనం

### రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఐఎండి హెచ్చరికల ప్రకారం ... రానున్న 48 గంటల్లో కొన్ని ఎపిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు, మెరుపులు నమోదయ్యే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. త్వరలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

2 పేజీలో..

నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి

## పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

- రేవంత్ రెడ్డి
- పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి
- నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి
- అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్ : తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు.

2 పేజీలో..



# సంపాదకీయం

## నయా నియంతృత్వంలో ట్రంప్



ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాలంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్ధాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్ప పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ పక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

# వాళ్లది రోజుకో రాజకీయం

మొదటి పేజీ తరువాయి

వారు కొనుగోలు చేసిన నెయ్యిని పరీక్షిస్తే జంతువుల కొవ్వు కలిసినట్టు ల్యాబ్ నివేదిక వచ్చిందన్నారు. దీనిపై సెట్ ఏర్పాటు చేస్తే సరఫరా చేసింది నెయ్యే కాదని తేలిందన్నారు. ఆ తప్పును బయటపెడుతుంటే దానిని ఇతరులపై నెట్టి వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. వివేకా హత్య ఘటనలో నాటకాల రాయుడు రోజుకో వేషం వేశాడని ఆక్షేపించారు. చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేలా నాటకాలు రక్తి కట్టించారన్నారు.

**తప్పించుకోవడానికి హెరిటేజ్‌పై నిందలు**

గత పాలనలో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, అవినీతి జరిగిందని చెబుతుంటే తిరిగి హెరిటేజ్ పై నిందారోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. కల్తీ నెయ్యితో ప్రసాదాన్ని కల్తీ చేసిన వ్యక్తులు ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. దొంగే దొంగా దొంగా అనే పరిస్థితి వచ్చిందని.. నిందితుల్ని చట్టం ముందు నిలబెడతామని సీఎం స్పష్టం చేశారు. మసీదు, చర్చి, దేవాలయం ఏదైనా వాటి పవిత్రత కాపాడాలని...ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టగానే టీటీడీలో ప్రక్షాళన చేపట్టామని అన్నారు. శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు వెంకటేశ్వర స్వామి ఫొటోలను చెప్పులతో తీసుకెళ్లారని..సభలో రాజకీయం చేసి అనంతరం వేంకటేశ్వరస్వామి ఫొటోలను అక్కడే పడేశారని వ్యాఖ్యానించారు. వారికెందుకు ఇంత అహంకారం అని సీఎం ప్రశ్నించారు. గత పాలనలో రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసి పరిశ్రమల్ని తరిమేశారని .. ఆంధ్రప్రదేశ్ కు ఉన్న నమ్మకాన్ని పోగొట్టారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, భవిష్యత్ ఆదాయం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని ఆక్షేపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభమైందని అన్నారు.

**నిద్ర లేస్తే వారివి చెత్త రాజకీయాలే**

రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు, రౌడీ రాజకీయాలు చేస్తున్నారని సీఎం ఆరోపించారు. పరామర్శలకు అని వెళ్లి వాళ్ల కార్ల కింద మనుషుల్ని చంపేస్తారని అన్నారు. బూతులు తిట్టిన వాళ్లను.. రౌడీయిజం చేసిన వాళ్లను పరామర్శించే వ్యక్తులు కారు కింద పడిన వారిని మాత్రం పరామర్శించరని సీఎం విమర్శించారు. వైసీపీ నేతల బూతు వ్యాఖ్యలపైనా సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. గతంలో అసెంబ్లీలో తన సతీమణిపై దుర్భాషలాడి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని...అధికారంలో ఉన్నా విపక్షంలో ఉన్నా ఆ పార్టీ బూతులు మాట్లాడటం మానలేదని అన్నారు. వారితో తిట్టించు కోవడానికే రాజకీయం చేస్తున్నామా? అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆబోతుల మాదిరిగా తయారై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని.. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యతలో ప్రజలూ కలిసి రావాలని సీఎం వ్యాఖ్యానించారు. చెడును నిరాకరించే పరిస్థితి ప్రజల్లో వచ్చినప్పుడే రాజకీయాల ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఉన్నపళంగా అరెస్టు చేస్తున్నట్టు చెప్పి తనను జైల్లో వేశారని అక్కడి నుంచి బయటకు రారని తనకు చాలా మంది చెప్పారని అన్నారు. అయినా కేవలం ప్రజల కోసం రాష్ట్రం కోసమే ఇప్పటికీ పోరాటం చేస్తున్నానని సీఎం వ్యాఖ్యానించారు. గత పాలకులు రాష్ట్రాన్ని గంజాయి మయం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మత్తు సేవించి ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందనే భయంతో మదనపల్లి అత్యాచార కేసులో మృగాడు ప్రాణాలు తీసుకున్నాడని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకే తన తొలి ప్రాధాన్యమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు రౌడీ రాజకీయాలు చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు.

# నేతన్నకు వెంకన్న దీవెన

మార్కెటింగ్ అధికారులు ఆర్డర్ ఇచ్చారు. మొదటి విడతగా మూడు వేల కండువాలు, అయిదు వేల దుశ్శాలువాలు, 90 వేల కాటన్ అప్పర్ లు, 75 వేల కాటన్ బ్లౌజ్ లు తిరుమల దేవస్థానానికి సరఫరా చేయాలోని ఆ ఆర్డర్ లో టీటీడీ అధికారులు పెర్కొన్నారు. టీటీడీకి అందజేసే కండువాలు, దుపట్టాలు, కాటన్ బ్లౌజ్ లపై ఓం నమో వేంకటేశాయ అని తెలుగులో, సంస్కృతంలో ముద్రించాలని టీటీడీ స్పష్టం చేసింది.

**ఆప్కో చరిత్రలో మొదటిసారి టీటీడీ ఆర్డర్**

భక్తులకు అందజేసే కండువాలు, శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు సరఫరా బాధ్యత గతంలో తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ కు ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పనే లక్ష్యంలో భాగంగా టీటీడీ నుంచి ఆప్కో కు ఆర్డర్ వచ్చేలా చేసిన కృషి ఫలించింది. ఈ అవార్డు రావడంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, అధికారులు పాత్ర మరువలేనిది. ఆప్కో ఏర్పడి 51 ఏళ్లలో మొదటిసారి టీటీడీ నుంచి ఆర్డర్ రావడం విశేషం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత చేనేత రంగ అభివృద్ధికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా నేతన్నలకు నిత్యం ఉపాధి కల్పించే దిశగా కో ఆప్టెక్స్, టాటా, తనేరియా, బిర్లా ఆద్యం సంస్థలతో ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆర్డర్ తో రాష్ట్రంలో చేనేతలకు మరింత ఉపాధి లభించనుందని చేనేత సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సీఎం చంద్రబాబునాయుడుకు, మంత్రి సవితకు, టీటీడీకి ధన్యవాదాలు తెలియజేశాయి.

**చేనేతకు వెంకన్న దీవెన : మంత్రి సవిత**

నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి, ఆర్థిక భరోసా కూడిన జీవనం అందించాలన్న సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేతన్నలకు ప్రయోజనాలు కలిగేలా పథకాలు రూపొందిస్తున్నామని, పలు ఒప్పందాలు కూడా చేసుకుంటున్నామని వెల్లడించారు. ఆప్కో చరిత్రలో మొదటిసారి టీటీడీతో ఒప్పందం చేసుకోవడం ఆనందకర విషయమన్నారు. టీటీడీ ఆర్డర్ నేతన్నలకు వెంకన్న దీవెన వంటిదన్నవారు. టీటీడీ, ఆప్కో ఒప్పందం కుదురడంలో ముఖ్యభూమిక పోషించిన చేనేత, జౌళి శాఖాధికారులను మంత్రి సవిత అభినందించారు. ఏపీ నేతన్నలకు మేలు కలిగేలా నిర్ణయం తీసుకున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పాలకమండలికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆర్ఎస్ఎస్ పరువు నష్టం కేసు

2016 సెప్టెంబరులో రాహుల్ ఈ కేసును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుని విచారణ ఎదుర్కొంటానని చెప్పారు. ఈ కేసు విచారణ సందర్భంగానే నేడు రాహుల్ భివాండి కోర్టు ఎదుట హాజరుకానున్నారు.

## యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు...

మొదటి పేజీ తరువాయి

అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం. ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది. ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు.డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

## కార్లతో ర్యాలీ..

కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు.

## అల్పపీడనం

దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలు ఎక్కువగా ప్రభావితమవుతాయని, పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశముందని తెలిపారు. ఇతర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముంది. పలుచోట్ల పిడుగులు పడతాయని, ప్రజలెవ్వరూ చెట్ల కింద నిలబడకూడదని, కరెంట్ స్తంభాలకు దూరంగా ఉండాలని, పాడుబడిన భవనాల వద్ద ఆశ్రయం పొందవద్దు అని, రైతులు పొలాల్లో అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.



# మీ ఆనందమే నా ఆనందం..

శివరాత్రి ప్రభలు అంటే కోటప్పకొండ ప్రభలే గుర్తుకు వస్తాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయి. నేను గతంలో ముఖ్యమంత్రిగా పచ్చదనం-పరిశుభ్రత, నీరు-మీరు, ఆకస్మిక తనిఖీలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. స్వచ్ఛాంధ్ర అంటే రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదు. స్వచ్ఛత మన జీవిన విధానంలో భాగం కావాలి' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**పరిసరాల శుభ్రత.. మన బాధ్యత**

'రాష్ట్రంలోని ప్రతి మండలానికో స్వచ్ఛ రథం ఏర్పాటు చేస్తున్నాం. వారానికోసారి రథాలు గ్రామానికి వస్తాయి. ఇళ్లలో పనికి రాని వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసర వస్తువులు ఇస్తారు. అన్నింటికంటే మనకు ముఖ్యమైనది ఆరోగ్యం. ఆరోగ్యం బాగుండాలంటే మంచి పరిసరాలు, శుభ్రమైన కార్యాలయాలు, గ్రామాలు ఉండాలి. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రంలో 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. వర్షాలకు ఆ చెత్త భూమిలో ఇంకి తద్వారా భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి వచ్చింది. నూటికి 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. వచ్చే నెల కల్లా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో 100 శాతం ఇంటింటికీ చెత్త సేకరిస్తాం. రాష్ట్రంలో 4,14,004 కుటుంబాలు హోం కంపోస్టింగ్ చేస్తున్నారు. 4,19,288 టెర్రస్ గార్డెన్లు ఉన్నాయి. రాజమండ్రి, కర్నూలు, కడప, నెల్లూరులో రూ.1,254 కోట్లతో పీపీపీ విధానంలో 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల'ను మార్చి 15కల్లా వినియోగంలోకి తీసుకువస్తాం'అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ**

'రాష్ట్రంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించాం. ప్లాస్టిక్ వల్ల ప్రజలు, పశువుల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించటం, విద్యుత్ ఉత్పత్తి లాంటివి చేస్తున్నాం. చెత్త సేకరణ కోసం ట్రై సైకిళ్లు, ఈ-ఆటోలు, వివిధ యంత్రాలను వినియోగిస్తున్నాం. విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రి సహా మరో 5 ప్లాంట్లు త్వరలోనే ఏర్పాటు చేసి చెత్త నుంచి విద్యుత్ తయారు చేసేందుకు చర్యలు చేపడతాం. చెత్త, వ్యర్థాల నిర్వహణలో మన ఆలోచనా తీరు మారాలి. మలేరియా, డెంగ్యూ, డయేరియా లాంటి సంక్రమిత వ్యాధులు తడి వ్యర్థాల కారణంగానే వస్తున్నాయి. జపాన్ లో రోడ్లపై చిన్న కాగితం ముక్క కూడా కనిపించదు. అక్కడి పౌరుల తరహాలో మనమూ కొన్ని అలవాట్లను మార్చుకోవాలి' అని ముఖ్యమంత్రి సూచించారు.

**రాష్ట్రంలో పెను మార్పులు రాబోతున్నాయి**

'రాబోయే రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో పెను మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నాం. నేను స్వయంగా కార్యక్రమంలో పాల్గొంటున్నాను. ఇంత పెద్ద సంక్షేమ కార్యక్రమం అమలు చేయడంలో దేశంలోని మరే రాష్ట్రంలోనూ మన దరిదాపుల్లో లేదు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు ద్వారా పేదలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందిస్తాం. అన్ని నియోజకవర్గాల్లోనూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం. గిట్టుబాటు ధర వచ్చే పంటలనే రైతులు వేయాలని కోరుతున్నాను. వారసత్వంగా వచ్చే పంటలనే పండిస్తే ఆదాయం తక్కువ వచ్చి ఇబ్బందులు వస్తాయి. రైతుకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. ఏఐ ద్వారా వ్యవసాయ నిపుణుణ్ని అందుబాటులోకి తెచ్చి రైతుకు శిక్షణ అందిస్తాం. ఇటీవల బిల్ గేట్స్ రాష్ట్రంలో పర్యటించినప్పుడు మనవాళ్ల టెక్నాలజీ వినియోగాన్ని మెచ్చుకున్నారు. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉంది. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తున్నాం. అందులో భాగంగా వినుకొండను కూడా అభివృద్ధి చేస్తాం. 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. మొదట్నుంచీ డ్వాక్రా మహిళలు నాకు అండగా ఉన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేసే బాధ్యత తీసుకున్నాం. సంక్షేమ కార్యక్రమాల అమలుతో ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**పీ4తో పేదలకు ఆర్థిక చేయూత**

'సమాజంలో అట్టడుగున ఉన్నవారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే పీ4 కింద లక్షమంది మార్గదర్శులు... 10 లక్షల మంది పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. అట్టడుగున ఉండే 20 శాతం బంగారు కుటుంబాలు, పైన ఉండే 10 శాతం మార్గదర్శులు కలిసి పనిచేస్తే రేపటి రోజున ఈ బంగారు కుటుంబాలే మార్గదర్శులు అవుతారు. పీ4 ద్వారా 100 కుటుంబాలను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుని అభినందిస్తున్నాను. ఈ పథకం ద్వారా మరింతమంది పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు మరికొందరు ముందుకు రావాలి' అని సీఎం చంద్రబాబు కోరారు.

**ఢిల్లీలో ఏఐ సదస్సు సమయంలో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం**

'ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సదస్సుకు నేను హాజరయ్యాను. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీలను ప్రధాని మోదీ ఆహ్వానించారు. సుమారు 60 దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. విద్య, వైద్యం, వ్యవసాయం సహా వివిధ రంగాల్లో ఏఐ ఏం చేస్తుందో తెలిపారు. ఢిల్లీలో ఇంతమంచి సదస్సు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ వాళ్లు దారుణంగా ప్రవర్తించారు. ఓవైపు ప్రపంచమంతా టెక్నాలజీలో ముందుకుపోతుంటే.. యువత ప్రయోజనాలు కాపాడాల్సిన పార్టీలు అర్ధనగ్న ప్రదర్శన చేయడం నన్ను బాధించింది. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ తరహా శైలి దేశానికి నష్టం చేస్తుంది. మన రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఏం జరిగిందో చూశాం. ఏపీ అంటే అందరూ ఛీ కొట్టారు. పారిశ్రామికవేత్తలు పారిపోయారు. ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు చేశారు. అరాచక పాలనకు వ్యతిరేకంగా టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్తే ప్రజలు గొప్ప విజయం అందించారు. కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా వెంటనే ప్రజల కోసం అమలు చేయడం నాకు అలవాటు. 1995లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చి హైటెక్ సిటీ కట్టాను. 25 ఏళ్లలో దేశంలోనే ఎక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. అందుకు మన దూరదృష్టే కారణం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. అమరావతిని క్వాంటమ్ వ్యాలీకి చిరునామా చేస్తాం. విశాఖలో భాగస్వామ్య సదస్సు ద్వారా రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. మెగా డీఎస్సీ ద్వారా 15,600 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఎన్డీఏ కూటమిదే. రోడ్ల మరమ్మతులు చేపడుతున్నాం. కరెంటు చార్జీలు పెంచబోం. వినుకొండ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని 1000 పడకల ఆస్పత్రిగా మార్చుతాం.

ట్రామా కేర్ సెంటర్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. వినుకొండలో అగ్రికల్చర్, వెటర్నరీ కాలేజీల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం. బస్టాండ్ ను ఆధునీకరిస్తాం.' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**స్టాళ్ల సందర్శన..ఉత్పత్తుల పరిశీలన**

వ్యర్థాల సేకరణ కోసం వినియోగించే స్వచ్ఛ రథాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ప్రజా వేదిక వద్ద వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లతో పాటు మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ సన్మానించారు. దాచేపల్లికి చెందిన స్వచ్ఛ రథం డ్రైవర్ దుర్గారావు, హోం కంపోస్టింగ్ విభాగంలో లక్ష్మీ గోవిందమ్మను ముఖ్యమంత్రి సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# సాహో.. సేంద్రియ సాగు..

- గేమ్ ఛేంజర్‌గా ప్రకృతి వ్యవసాయం
- విజయవంతంగా ఎన్టీఆర్ ఆర్గానిక్ రైతోత్సవం
- జిల్లాలో తొలి విడతగా లక్ష ఎకరాల్లో సాగు దిశగా అడుగులు
- ప్రతి రైతూ ఒక బ్రాండ్ అంబాసిడర్, ప్రతి గ్రామం ఒక క్లస్టర్
- భూమికి, రైతుకు, సమాజానికి బహుళ ప్రయోజనాలు
- ప్రజల భాగస్వామ్యంతో మహోద్యంగా ప్రకృతి వ్యవసాయం
- సేంద్రియ వ్యవసాయంతో కార్బన్ క్రెడిట్లు
- అన్నదాతలకు అదనపు ఆదాయానికి సరికొత్త మార్గం
- సీఎం దార్శనికతకు అనుగుణంగా ట్రేసబులిటీకి ఏర్పాట్లు
- విత్తు నుంచి విక్రయం వరకు సమస్త సమాచారం అరచేతిలోనే
- ఇటు రైతులకు, అటు వినియోగదారులకు ప్రయోజనాలు
- ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి.. సమష్టిగా దీన్ని కాపాడుకుందాం

**- రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
రాష్ట్రంలో ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రకృతి సాగును మహోద్యమంగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో సరికొత్త మైలురాయి. రైతులను, వినియోగదారులను, మార్కెటింగ్ విభాగాలు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలను ఒకేవేదికపైకి తీసుకొస్తూ ఎ.కొండూరు మండలం, కృష్ణారావు పాలెంలో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ ఆర్గానిక్ రైతోత్సవం విజయవంతమైంది. ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ, శ్రేయాస్ ఫార్మర్స్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా విస్తృత ప్రజా జాగృతి ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ప్రకృతి సాగు ఉద్యమంలో ప్రతిఒక్కరం భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. రైతు సాధికార సంస్థ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, బయో ఇన్‌పుట్స్, పీఆర్ఐటీహెచ్‌యూ (రీజెన్ అగ్రి కార్బన్ ప్రాజెక్టు), బయో ఎరువులు, పురుగు మందులు, బయో రిసోర్స్ సెంటర్ - మార్కెటింగ్ (బీఆర్‌సీ-మార్కెటింగ్), కార్బన్ క్రెడిట్స్ అండ్ ట్రేసబులిటీ తదితర స్టాళ్లను ఏర్పాటు చేశారు. దేశవాళీ వంగడాలు, జీవామృతం, గో ఆధారిత ఉత్పత్తులు, ఆధునిక యంత్రపరికరాలు, వ్యవసాయ డ్రోన్లు తదితరాలను ప్రదర్శించారు. రేపటి తరానికి సారవంతమైన నేల, ఆరోగ్యకర జీవితాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు కదులుదామంటూ ప్రోత్సహించిన కళాజాత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రకృతి సేద్య విధానాలను అనుసరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఏడు మంది రైతులను కార్యక్రమంలో సత్కరించారు.రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ వై.సతీష్, క్రాప్ ప్రొడక్షన్ స్పెషలిస్టు డా. పీఎస్ శివప్రసాద్, హ్యూమన్ ఫస్ట్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అండ్ సీఈవో సున్నీ షైన్, ప్రబాల్ తోమర్ (కిసాన్ లెడ్జర్), రఘురాం (భూమి ఆర్గానిక్), ఆషా కిరణ్ (అమరావతి విలేజ్ ఆర్గానిక్), శశి కుమార్ (అక్షయ్ కల్ప ప్రైవేట్ లిమిటెడ్) తదితరులు ప్రకృతి వ్యవసాయ రంగ విజ్ఞానాన్ని అందించారు.

### లక్ష ఎకరాల లక్ష్యం – కార్యాచరణ ప్రారంభం:

రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ మాట్లాడుతూ సేంద్రియ సాగువల్ల భూమికి, రైతులకు, సమాజానికి బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని, గిరిజన రైతులు ఎక్కువగా ఉండే ఎ.కొండూరు నుంచి సరికొత్త రూపంలో ప్రకృతి వ్యవసాయం మహో ద్యమంగా ముందుకెళ్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటగా ఏర్పడిన ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీకి ఛైర్మన్‌గా సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. పెరిగిన సాగు ఖర్చులు, ఆదాయాల్లో అస్థిరతలు, ప్రజారోగ్యానికి కొత్త సవాళ్లు.. వీటన్నింటికీ పరిష్కారం ప్రకృతి సాగు అని పేర్కొన్నారు. నేడు ప్రపంచ మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు బాగా డిమాండ్ ఉందని.. సరఫరా తక్కువగా ఉంద న్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకు నేలా రైతులను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

### దార్శనికతకు అనుగుణంగా ట్రేసబులిటీ:

విత్తు ఎంపిక నుంచి పంట కోత, నిల్వ, రవాణా, విక్రయం వరకు ప్రతి దశలో సమాచారాన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయడం.. ఈ ట్రేసబులిటీ విధానం ద్వారా వినియోగదారులు కొనుగోలు చేసే ఉత్పత్తి ఎక్కడ పండింది, ఏ సర్వే నంబరులో సాగు చేశారు.. ఏ విధమైన సేంద్రియ ఎరువులు ఉపయోగించారు.. ఇలా సమస్త సమాచారాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే ట్రేసబులిటీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. దీంతో మార్కెట్లో నమ్మకం పెరిగి, రైతులకు మెరుగైన ధరలు, వినియోగదారుని ఆరోగ్యానికి భరోసా కల్పించే వ్యవసాయ ఉత్పత్తులు లభించే అవకాశాలు ఉంటాయన్నారు.

### ప్రతి రైతూ ఒక బ్రాండ్ అంబాసిడర్, ప్రతి గ్రామం ఒక క్లస్టర్

జిల్లాలో, రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి రైతూ ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా, ప్రతి గ్రామాన్ని ఒక క్లస్టర్‌గా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. మన భూమిని మనం కాపాడుకోవాలి.. మన రైతును మనం గౌరవించుకోవాలి.. మేలైన ఆహారంతో సమాజ ఆరోగ్యానికి భరోసా కల్పించాలి.. ఈ లక్ష్యాలతోనే గౌరవ ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులతో ముందుకెళ్తున్నట్లు దేవదత్ తెలిపారు. జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక చొరవతో ఆర్గానిక్ సాగుకు సరికొత్త ఉత్సాహం వచ్చిందని పేర్కొన్నారు.

### లక్ష ఎకరాలు లక్ష్యంగా అడుగులు:

ప్రస్తుతం జిల్లాలో 42 వేల మంది రైతులు, దాదాపు 50 వేల ఎకరాల్లో ప్రకృతిసాగు జరుగుతోందని.. తొలి విడతలో లక్ష ఎకరాల్లో సాగు లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పామాయిల్‌లో అంతర పంటలు, ఉద్యాన పంటలు, కూరగాయలు, మిరప వంటి వాటిని పండిస్తున్నట్లు వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంపైనా అవగాహక కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా రైతుల గుర్తింపు, క్లస్టర్ల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక మద్దతు, మార్కెట్ లింకేజీలను సమగ్రంగా అమలు చేయనున్నామనారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ స్ఫూర్తి రైతులను తయారు చేసి, వారి ద్వారా ఇతర రైతులకు మార్గనిర్దేశం చేయనున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించడం ద్వారా నేల సారాన్ని పునరుద్ధరించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని వల్ల భూమి దీర్ఘకాలిక ఉత్పాదకత పెరగడంతో పాటు, రైతుల ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయి. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి రావడం ద్వారా సమాజ ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. *కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యమంలో యూనియన్ కీలక భాగస్వామ్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విత్తు నుంచి విక్రయం వరకు ప్రతిదశలోనూ సహాయసహకారాలు అందిస్తామని.. గో ఆధారిత ఉత్పతులను కొనుగోలు చేసి, రైతులకు సుస్థిర ఆదాయం అందేలా చూస్తామని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు శాయశక్తులా కృషిచేస్తామన్నారు. ప్రపంచ దేశాలు మనవైపు చూసేలా, రాష్ట్రాన్ని సేంద్రియ సాగులో కొత్త దిశగా నడిపించేందుకు కృషిచేస్తామని తెలిపారు.

### కార్బన్ క్రెడిట్లు – అదనపు ఆదాయం:

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడంలో సహకరిస్తాయి. దీనివల్ల రైతులు కార్బన్ క్రెడిట్ల రూపంలో అంతర్జాతీయ మార్కెట్ ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉంటాయని అధికారులు వివరించారు. ఇది సంప్రదాయ పంటల ఆదాయానికి తోడుగా సరికొత్త ఆదాయ వనరుగా మారనుంది. కార్బన్ క్రెడిట్ ప్రాజెక్టులో చేరడం ద్వారా పంటల ద్వారా, కార్బన్ క్రెడిట్ ద్వారా ఆదాయాన్ని పొందొచ్చు. నేల కార్బన్‌ను నిల్వ చేసినప్పుడు కార్బన్ క్రెడిట్లు ఉత్పత్తి అవుతాయి. కంపెనీలు ఈ క్రెడిట్లను కొనుగోలు చేస్తాయి. ఆ చెల్లింపు రైతులకు కార్బన్ ఆదాయంగా లభిస్తుందని నిపుణులు వివరించారు.

### మార్కెటింగ్ – విలువ ఆధారిత ఉత్పత్తులు

సేంద్రియ పంటలకు ప్రత్యేక మార్కెట్లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, ఆన్‌లైన్ విక్రయ వ్యవస్థల అభివృద్ధిపైనా సదస్సులో మేధోమథన చర్చలు జరిగాయి. స్థానికంగా ఉత్పత్తి చేసిన సేంద్రియ ధాన్యాలు, కూరగాయలు, పప్పులు, నూనెలు, విలువ ఆధారిత ఉత్పత్తులను రాష్ట్ర స్థాయిలో మరియు జాతీయ స్థాయిలో మార్కెట్ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రైతుల ఆర్థిక స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ, వినియోగదారుల ఆరోగ్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఎన్టీఆర్ జిల్లా సేంద్రియ సాగు విస్తరణలో ఆదర్శంగా నిలవాలని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, నాగసింధు స్పిన్నింగ్ అండ్ జిన్నింగ్ మిల్లు యజమాని శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ప్రకృతి వ్యవసాయ అధికారి, డీపీఎం వై.శంకర్ నాయక్, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, పశుసంవర్ధక అధికారి డా. హనుమంతరావు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

## వైసీపీ నేతలు బరి తెగించి మాట్లాడుతున్నారు:మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజాభూమి ప్రతినిధి , మచిలీపట్నం :
ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా కొంత మంది వైసీపీ నేతలు బరి తెగించి మాట్లాడుతున్నారు అని మం త్రి కొల్లు రవీంద్ర పేర్ని నాని ను విమ ర్శించారు. పేర్ని నాని మాట్లాడు తున్న మాటలను ప్రజలే అసహ్యాంచుకుంటున్నారు అని ఎద్దేవా చేశారు. మచిలీపట్నం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర వైసిపి నాయకులు పేర్ని వెంకట్రామయ్య నాని పై మండిపడ్డారు ఎన్నికల్లో పోటీ చేయడానికి భయపడి పారిపోయిన వ్యక్తి పేర్ని నాని అన్నారు.అటువంటి పేర్ని నానికి చంద్రబాబు, లోకేష్ లను విమర్శించే స్థాయి ఎక్కడది అని ప్రశ్నించారు. బందరులో రోడ్ల వెంట తిరిగే పిచ్చి కుక్కలు కూడా పేర్ని నానిని పట్టించుకోవు అని, క్రికెట్ అభిమానిగా నారా లోకేష్ క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్లితే తప్పేమిటి అని అడిగారు. లోకేష్ వెళ్లిన ఫ్లైట్ టికెట్ బోర్డింగ్ పాస్ నీకు చూపించాల్సిన అవసరం ఏమిటి అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో పరుగులు పెట్టిస్తున్నారు అని ప్రపంచంలో మేటి సంస్థ అయిన గూగుల్ ను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత ఎవరికైనా దక్కుతుందంటే అది లోకేష్ కే దక్కుతుంది అని కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను మంత్రి తెలిపారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
దుర్గమ్మను దర్శించుకున్న ఎన్టీఆర్ జిల్లా ప్రస్తుత కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ జి. లక్ష్మీశ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జిల్లా ప్రస్తుత కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ జి. లక్ష్మీశ ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కలెక్టర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి వివో సీనానాయక్ మరియు స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ కలెక్టర్ కలిసి ఆలయ అభివృద్ధి పనులపై ఆరా తీసారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





## అంగన్వాడి కేంద్రాలు తనిఖీ చేసిన పశ్చిమ తహసిల్దార్

### లేబర్ కాలనీలోని ఆరోగ్య కేంద్రాన్ని, కొండ బడి స్కూల్ లో మౌలిక వసతులు పరిశీలించిన రిబ్కా రాణి

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
విజయవాడ పశ్చిమ, అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయా సంక్షేమ ఫలాలు విధిగా ప్రతి చిన్నారికి అందాలని విజయవాడ పశ్చిమ తాసిల్దార్ రిబ్కా రాణి స్పష్టం చేశారు. శనివారం గట్టు వెనక ప్రాంతంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారులతో ముచ్చటించారు మీకు ఇక్కడ ఏమేమి అందజేస్తున్నారు ఇక్కడ వసతులు ఎలా ఉన్నాయి ఎలా వారితో అన్ని వివరాలు తెలుసుకొని సంబంధిత అంగన్వాడీ కేంద్రం అందిస్తున్న సేవలు సంతృప్తిగా ఉన్నాయని ఇక అక్కడ నుంచి లేబర్ కాలనీలోని జిఎన్ఆర్ స్కూల్ ( కొండ బడి ), సమీప ఆరోగ్య కేంద్రం ఇలా వరుసగా ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో గమనించారు. లేబర్ కాలనీలోని ఆరోగ్య కేంద్రాన్ని, రక్త పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి వ వైద్యులతోనూ ఇక్కడ ఉన్న వైద్య సిబ్బందితోను విధిగా వారు ఏ విధంగా అందిస్తున్న విధులు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ వైద్య ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం వచ్చే వారికి ఎటువంటి వైద్య సదుపాయాలు అందిస్తున్నారు వారికి మెడిసిన్ ఇస్తున్నారా లేదా సంబంధిత పూర్తి విషయాలు సేకరించారు.వసతులు, రిజిస్టర్ లు, మెడిసిన్ అంశాలు తనిఖీ చేసారు జి ఎన్ ఆర్ ఎం స్కూల్ (కొండ బడి )లో పదవ తరగతి విద్యార్థులకు వారిలో వివిధ సామాజిక అంశాలపై చైతన్యం తీసుకువచ్చే దిశగా కొద్దిసేపు సంబంధిత తరగతిని స్వయంగా పశ్చిమ తహసిల్దార్ రిబ్కా రాణి నిర్వహించడం జరిగింది. ఈ ఆకస్మిక తనిఖీల కార్యక్రమంలో .తహసీల్దార్ తో పాటు ఆర్ ఐ సిరి వెన్నెల, వీఆర్వో లు రజిత, కొండలరావు పాల్గొన్నారు.







## ఎంఎస్ బేగ్ ను కలిసిన నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు

ప్రజాభూమి ప్రతినిధి , విజయవాడ
ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నియమింపబడిన ఎం.ఎస్.బేగు ని నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు శనివారం ఉదయం విజయవాడ భావానిపురం లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్ గా నియమింపబడిన తర్వాత అధికారికంగా ఠాగూర్ గ్రంథాలయంలో జరిగే ఒక పుస్తకావిష్కరణ సభకు తొలిసారిగా హాజరవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని బేగ్ ను నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు శాలువాతో సత్కరించి, పుస్తకాలను జ్ఞాపికలుగా అందించారు. ఈ సందర్భంగా రచయితలకు గ్రంథాలయాలకు వున్న అనుబంధాన్ని ఆయనకు వివరించారు. అనంతరం బేగ్ మాట్లాడుతూ- గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. గౌరవ మంత్రివర్యులు నారా లోకేష్ నాయకత్వంలో అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఎన్నో వసతులతో ఉన్నతంగా వేగంగా నిర్మాణం జరగబోతుందన్నారు. ఈ లైబ్రరీలో పుస్తకాలను డిజిటలైజ్ చేసే గొప్ప సౌకర్యం వుండబోతుందన్నారు. రచయితలకూ గ్రంథాలయాలకు మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేకుండా సామరస్యభావంతో అభివృద్ధి దిశగా అడుగులేద్దామని అన్నారు. అందుకు రచయితల సంఘాలు జర్నలిస్టు సంఘాలు తోడ్పాటునందించాలన్నారు. ఎం.ఎస్.బేగ్ ను కలిసిన వారిలో నవ్యాంధ్ర రచయితల సంఘం జనరల్ సెక్రెటరీ కలిమిశ్రీ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ యేమినేని వెంకట రమణ, కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్, జిల్లా నాయకులు విష్ణుభొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర




ప్రజాభూమి ప్రతినిధి , మచిలీపట్నం:
కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యములో స్వర్ణాంధ్రా - స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని కోన,ఆర్ గొల్లపాలెం, రుద్రవరం గ్రామాల్లో ఉత్సహంగా నిర్వహించారు. జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో అంకురించిన ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని కృష్ణా యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తోంది.

వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే రాంజీ ప్రోత్సాహంతో వర్సిటీ చుట్టుపక్కల గ్రామాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహిస్తూ తన వంతు పాత్ర పోషిస్తుంది. కార్యక్రమంలో భాగంగా శనివారం కృష్ణా యూనివర్సటీ క్యాంపస్ లోని 8 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆయా ప్రోగ్రాం ఆఫీసర్లతో పల్లె తుమ్మలపాలెం, కోన, పోలాటి తిప్ప, రుద్రవరం, శారద నగర్, గుండు పాలెం, ఆర్ గొల్లపాలెం గ్రామాలలో వాలంటీర్లతో పలు పారిశుధ్య కార్యక్రమాలు,అవగాహనా సదస్సులు, ర్యాలీలతో ఆయా గ్రామస్తులతో స్థానిక పంచాయితీ అధికారులతో మమేకమవుతూ ముందుకు సాగారు...ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డా. పి గోపి, ఆర్.దుర్గాప్రసాద్, కె కవిత,డా. శేషారెడ్డి, శాంతి కృప, డా. సల్మా బేగం,రంగశ్రీ మరి కొంతమంది బోధనా సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ మరియు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచిన ఎన్టీఆర్ జిల్లా పోలీసులు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్ర మంలో భాగంగా నేడు "జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్'' కార్యక్రమంనగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.యస్ సూచనల మేరకు "జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్,'' అనే నినాధంతో ఈరోజు అన్ని పోలీస్ స్టేషన్లోను, ఏ.సి.పి. ఆఫీసుల్లోనూ, డి.సి.పి.ఆఫీసుల్లో, ఎస్.బి. సి.సి.ఆర్.బి. ఏ.ఆర్. ఆఫీ సుల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం.సంపూర్ణ పారిశుధ్యంపై అవగాహన పెంపొందించడం, బహిరంగ ప్రదేశాలలో చెత్త లేకుండ ఉంచుట కొరకు మరియు అవగాహన పెంపొందించడం మీ పరిసరాల్లో మరియు ఆఫీసు నందు గల మరుగుదొడ్లను పరి శుభ్రంగా ఉంచుకొనుటకు తీసుకోవలసిన చర్యలు గురించి సిబ్బందికి తెలియపరచి మరియు తడి చెత్తను, పొడిచేత్తని వేరుగా పడవేసి చెత్త రహిత ప్రదేశముగా ఉంచడానికి . తీసుకోవలసిన చర్యలు గురించి సిబ్బందికి తెలియపరచడం జరిగింది.స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా తమతోపాటు, చుట్టుపక్కల వారికి కూడా సంపూర్ణ పారిశుధ్యం కొరకు వంటి అంశాలపై అవగాహన పెంపొందించడంలో తమ వంతు కృషి చేస్తామని పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.



## వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి



**ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే "స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయితే మంచి ఫలితాలు వస్తాయి.**

**శుభ్రమైన - ఆరోగ్యకరమైన ఏలూరు, మీ ఫిర్యాదు - మా ప్రాధాన్యం 9491041419 వాట్సాఫ్ ఫోన్ నెంబరు, గడపగడపకు అవగాహన గోడ పత్రికలను ఆవిష్కరణ.**

**స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తంగెళ్ళమూడి భారతీయ ఆహార సంస్థ గోడౌన్లు ఏటిగట్టు ప్రాంతంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**

**ప్రజా భూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**

స్థానిక తంగెళ్ళమూడి 1వార్డు సచివాలయం వద్ద 27, 28వ డివిజన్ల పరిధిలోని శనివారం భారతీయ ఆహార సంస్థ గోడౌన్లు ఏటిగట్టు ప్రాంతంలో "స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా "ఈ-వేస్ట్ సేకరణ థీమ్"తో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఏపియస్ ఆర్టీసీ విజయవాడ -2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సంయుక్తంగా పాల్గొని, అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వార్డు సచివాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు.ముందుగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఏటిగట్టు ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి, క్లాప్ మిత్రాలతో మాట్లాడారు. రోజుకు ఎన్ని గంటలు పని చేస్తారు, ఏఏ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేస్తారు అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఉదయం ముందుగా రోడ్లను శుభ్రం చేసి చెత్తను ఒక చోట ప్రోగు చేసి, ఇంటింటికి వెళ్ళి తడి, పొడి చెత్తను సేకరిస్తామని తెలిపారు. దీంతో జిల్లా కలెక్టరు స్పందిస్తూ అంతా బాగా చేసినా అన్ని చోట్ల చెత్త ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. దీంతో క్లాఫ్ మిత్రాలు ఇంటింటికి వెళ్ళినప్పుడు పనులు ఉన్నాయని చెత్తను తర్వాత ఇస్తామని చెప్పి తర్వాత రోడ్డు ప్రక్కల, బయట చెత్తను వేస్తున్నారని, పట్టణ ప్రాంతాల్లో కల్యాణ మండపాలు, కన్వెన్షన్ సెంటర్స్ వద్ద కార్యక్రమాలు అయిన తర్వాత చెత్తను రాత్రి సమయాలలో ఇక్కడకు తరలించి చెత్తను వేస్తున్నారని చెప్పారు. దీంతో స్పందిస్తూ జిల్లా కలెక్టరు శాశ్వత చర్యలకు నగరపాలక సంస్థ కమిషనరుకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని మండలాలు, మునిపాలిటీలో ఒక మహోద్యమంగా జరుగుతున్నాయన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం తంగెలమూడి ఏటిగట్టు ప్రాంతంలో నిర్వహించుచున్నామని అన్నారు. ఈ-వేస్ట్ పర్యావరణానికి విఘాతమని పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రమైన నగర, గ్రామాలు నిర్మాణ కోసం పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఛార్జర్లు, బ్యాటరీలు, టీవీలు, తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సక్రమంగా సేకరించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం మని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం అయినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. శుభ్రమైన ఏలూరు, ఆరోగ్య కరమైన ఏలూరు 'మీ ఫిర్యాదు - మా ప్రాధాన్యం' పై ఇప్పటికే నగరపాలక సంస్థలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మరలా ఈరోజు 9491041419 మీరు నేరుగా కాల్ చేయవచ్చన్నారు. లేదా ఎస్ఎంఎస్ పంపవచ్చును లేదా వాట్సప్ ద్వారా మీ సమస్యలను తెలియ జేసినట్లయితే కొన్ని నిమిషాల్లో పరిష్కరించి, ఏలూరును పరిశుభ్రతలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మనమంతా కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. త్వరలో ఇక్కడ ఒక చెక్ పోస్టును ఏర్పాటు చేస్తామని, చెత్తను వేసే వాహనాలను ఫోటోలు తీసి వాట్సఅఫ్ పెట్టితే చర్యలు వెనువెంటనే తీసుకుంటామని, అలాగే చెక్ పోస్టును 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకుంటే పరిస్థితి తప్పక మారుతుందని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, దీనివల్ల వ్యాధులు దూరం అవుతాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించడం ఒక అభిరుచిగా చేసుకోవాలన్నారు. మన ఇంటితోపాటు చుట్టు ప్రక్కల పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. శీతాకాలం సీజన్లో అంటూ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయని, చిన్నారులు, వృద్ధులు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దుటకు, పరిశుభ్రంగా మార్చటం కోసం రాష్ట్రంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఒక ఉద్యమంగా ముందుకుతీసుకు వెళ్ళుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒక అంశంమీద జరుగుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు భాగస్వామ్యం కావాలని తెలిపారు. స్వర్ణాంధ్ర-- స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు ప్రజలందరూ చురుకుగా పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, ఏలూరు ఉడా చైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాద్, జిల్లా వివిధ శాఖల అధికారులు, సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, నగర పాలక సంస్థ ఉద్యోగులు, వార్డు సచివాలయ ఉద్యోగులు, పట్టణ పలు విద్యాసంస్థల విద్యార్థులు, యన్ సిసి, యన్ ఎస్ ఎస్, పలు సేవా సంస్థల సభ్యులు, స్థానిక ప్రజలు, క్లాప్ మిత్రాలు, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే జూన్ నెలాఖరు నాటికి అందరికీ టిడ్కో గృహాలు పూర్తిచేసేలా పనులు

**..... పాలకొల్లులో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి రామానాయుడు.**

**ప్రజాభూమి ప్రతినిధి , పాలకొల్లు**



పాలకొల్లులో మహిళలు, పేదల సొంతింటి కల నెరవేర్చేలా వచ్చే జూన్ నెలాఖరు నాటికి మిగిలిన టిడ్కో గృహాలను పూర్తి చేసి అప్పగించేలా పనులు వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు పట్టణంలో కోటి 50 లక్షలు తో జరుగుతున్న 27వ వార్డు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ సుందరీకరణ పనులు, టిడ్కో గృహాల పనులు, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సుందరీకరణ పనులను కూటమి నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా జరగడంతో పాటు ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంను అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో గత వైసిపి ప్రభుత్వం లో మరుగున పడిన, విధ్వంసానికి గురైన అభివృద్ధి పనులను నేడు కూటమి ప్రభుత్వంలో గాడిలో పెడుతున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ అందుకు అవసరమైన నిధులను వివిధ శాఖల వారీగా తీసుకొస్తున్నట్లు చెప్పారు. పనులు జరుగుతున్న టిడ్కో గృహాల బ్లాకులను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతోపాటు సమీక్ష చేయడం జరిగింది. గత టిడిపి ప్రభుత్వంలో పేదలు, మహిళల సొంతింటి కల తీర్చేలా టిడ్కో గృహాలను 70 శాతం నుంచి 100 శాతం వరకు పూర్తి చేస్తే మిగిలిన పది నుంచి 30 శాతం పనులను వైసిపి ఐదేళ్ల పాలనలో అరబస్త సిమెంట్ పని గానీ, రూపాయి ఖర్చు గాని చేయకుండా పడకేసిందన్నారు. దీంతో గృహాలు చెదల పట్టి, పాడయ్యాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిగిలిన గృహాలను గాడిలో పెట్టామన్నారు. ఇంకా 111 బ్లాక్ ల గృహాలు పూర్తి కావలసి ఉండగా కూటమి ప్రభుత్వ ఏడాది కాలంలో 60 బ్లాకుల ఇల్లు పూర్తయ్యాయని, మిగిలినవి వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రణాళికంగా తీసుకున్నామన్నారు.నాడు టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వంలో బ్యాంకులో తాకట్టు పెట్టి 150 కోట్లు నుంచి 160 కోట్లు వరకు దారి మళ్లించిన దుర్మార్గుడు జగన్ అని పేర్కొన్నారు. బ్యాంకు నుంచి ఋణం తీసుకున్న సొమ్ముతో ఇళ్ళు పూర్తి చేసేందుకు ఒక్క రూపాయి గాని, అర బస్తా సిమెంట్ గాని ఖర్చు చేయక పోగా రంగులేసుకుని చేతులు దులుపుకున్నారు.లబ్ధిదారుల నుంచి తీసుకున్న బ్యాంకు రుణం, గృహాల నిర్మాణ ఖాతాలో ఉంటే, ఇప్పటికే మిగిలిన ఇళ్ళు పూర్తి చేసి అందరికీ అందజేసే వాళ్ళమని,నేడు కూటమి ప్రభుత్వ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ హడ్కోనించి అప్పు తెచ్చి టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలు, మహిళలకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఇళ్లతో పాటు, అన్ని మౌళిక వసతులు కల్పించే దిశగా పనులు వేగవంతంగా చేస్తున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు .మాజీ ఎమ్మెల్సీ అంగర రామోహన్,కమీషనర్ విజయసారది,పెచెట్టి బాబు,యూ కబర్ది,డాక్టర్ ఎర్రా మాధురి తదితరులు పాల్గొన్నారు.

## దెందులూరు మండలంలో ఎఫ్‌పీ షాప్ డీలర్లతో సమీక్ష సమావేశం

**ప్రజాభూమి దెందులూరు**



.ఏలూరు జిల్లా కలెక్టర్ (జూ) ఆదేశాల మేరకు దెందులూరు మండలంలో ఎఫ్‌పీ షాప్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం శనివారం నాడు దెందులూరు మండల తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఎస్.ఓ ఏలూరు, తహసీల్దార్ దెందులూరు మరియు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.టెలి-కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ సమావేశం నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో పలు ముఖ్య అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఎఫ్‌పీ షాపుల్లో నిర్ణయించిన సమయాల నిర్వహణ, పీడీఎస్ సరుకుల పంపిణీ మరియు నాణ్యత, ఈసీల నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రైస్ కార్డుదారుల నుండి ఌ= కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరణ, ఈసీల పోర్టబిలిటీ సౌకర్యం అమలు, డీలర్లు రైస్ కార్డుదారులతో సౌమ్యంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు.అదేవిధంగా ×ఎ=ూ ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను సమీక్షించి, సేవల మెరుగుదల కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. వయస్సు 65 సంవత్సరాలు దాటిన వారికి డోర్ డెలివరీ సౌకర్యం కల్పించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది.సమావేశం ముగింపులో, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని డీలర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు.

## బాలగణపతి స్వామి వారి దేవాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం.

**హాజరైన ఆర్టీసీ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు.**

**ప్రజాభూమి ఏలూరు.**



నియోజకవర్గం స్థానిక 20 డివిజన్ మినీ బైపాస్ రోడ్ లోని రామకృష్ణాపురంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ బాలగణపతి స్వామి వారి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా శాస్త్రోస్తంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జి రెడ్డి అప్పల నాయుడు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అప్పల నాయుడు మాట్లాడుతు రేవతి నక్షత్రయుక్త మేషలగ్న పుష్కరాంశమునందు ఏలూరు రామకృష్ణపురం మినీ బైపాస్ రోడ్డులో 46 సంవత్సరాలుగా వేంచేసియున్న భక్తులు కోరిన కోర్కెలు తీర్చే గణపతీ శ్రీ బాలగణపతీ స్వామిగా పూజలందుకుంటున్న గణపతి ఆలయ ప్రాంగణం నందు క్షామ, అగ్నిభయ, జార, చోర, అతివృష్టి, అనావృష్టి, ఈతిబాధ నివృత్తి అర్థం, లోక కళ్యాణం, త్రయాహ్నిక దీక్షగా నూతన ధ్వజ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆ వినాయకుడు ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచన, కరన్యాసం, నవరత్న న్యాసములు, హోమాలు దివ్య ప్రతిష్ట, మహా పూర్ణాహూతి, ముహదాశీర్వచన, తీర్థ ప్రసాద వితరణ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమములు యాజ్ఞీక బ్రహ్మ బ్రహ్మశ్రీ తూములూరి విశ్వనాథ శాస్త్రి పర్యవేక్షణలో పండుగ వాతావరణం లో జరిగింది. ఈ కార్యక్రమం లో జనసేన నగర అధ్యక్షులు వీరంకి పండు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి ఆర్ ఎన్ ఆర్ నాగేశ్వరావు, టీడీపీ నాయకులు కప్ప ఉమా,ఆకుల ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు,భారీ సంఖ్యలో భక్తులు, వివిధ హోదాల్లో కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటిలో చెత్తను వదిలించుకోండి - నిత్యవసరాలను పొందండి.

**జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్.**

**ప్రజాభూమి, బుట్టాయగూడెం.**



ఇంటిలో చెత్తను వదిలించుకోండి, ప్రత్యామ్నాయంగా అవసరమైన నిత్యావసరాలను పొందండని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ రథం' కార్యక్రమంలో భాగంగా ( ప్రతి మండలానికి ఒక్కొక్క స్వచ్ఛ రథం కేటాయించబడినది) బుట్టాయిగూడెం మండలానికి కేటాయించబడిన స్వచ్ఛ రథాన్ని శనివారం సాయి చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా చేపట్టాలని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు ప్రభుత్వం చేస్తున్న కృషికి సహకరించాలన్నారు. ఎంపీడీవో కె.జ్యోతి మాట్లాడుతూ స్వచ్ఛ రథం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి ఇంటికి చేరుకొని పొడి చెత్త (డ్రై వేస్ట్ - ప్లాస్టిక్, అట్ట ముక్కలు) సేకరిస్తుందని చెప్పారు. సేకరించిన చెత్తకు ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం, వస్తు మార్పిడి విధానంలో పప్పులు, ఉప్పు, నూనె మొదలైన గృహావసరాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తెల్లం రమణ, పోలవరం నియోజకవర్గం బిజెపి కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుగ్గులోతు మోహన్ రావు, గ్రామ పంచాయతీ సర్పంచ్ లు మరియు వివిధ పార్టీల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి వాకర్స్ క్లబ్ పాలకొల్లు ఆర్థిక సాయం

**ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు**




పాలకొల్లు లోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న యలమంచిలి మండలం లక్ష్మీపాలెం కు చెందిన ప్రతిభావంతురాలైన పేద విద్యార్థిని పొన్నమండ లలితా వెంకటశ్రీ కి ఫీజు చెల్లించు నిమిత్తం అవసరమైన 5 వేల రూపాయలను వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు శనివారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, కర్రి కిరణ్ కుమార్, ఉపాధ్యాయుడు చేగొండి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు...

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర సాధనకు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయాలి

**ఐటిడిఏ పిఓ కె. రాములు నాయక్.**

**ప్రజాభూమి, బుట్టాయగూడెం.**



స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రతి ఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో కృషి చేయాలని ఐటిడిఏ పిఓ కె. రాములు నాయక్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర --స్వచ్ఛాంధ్ర కార్యక్రమం భాగంగా శనివారం కె.ఆర్.పురం, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ కార్యాలయం చుట్టు పక్కల చెత్త, వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా పిఓ కె.రాములు నాయక్ మాట్లాడుతూ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. పని చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం మెరుగవుతుందని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. పరిశుభ్ర వాతావరణం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, అందరూ సమాజానికి ఆదర్శంగా నిలిచే విధంగా శుభ్రతపై దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం నందు ఐటిడిఏ, కె.ఆర్.పురం కార్యాలయాలలో ఉన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## పూర్వ విద్యార్థుల దాతృత్వం

**ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి**



ఆగిరిపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆగిరిపల్లికు చెందిన 1995--96 విద్యాసంవత్సరపు పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంక్షేమం కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద వంట నిర్వహణకు అవసరమైన మెగా గ్యాస్ కనెక్షన్ కోసం రూ.20,000 డిపాజిట్‌గా, వంట స్టోవ్‌ల కొనుగోలుకు రూ.5,000 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.కే. ఇలియాస్, వడ్డీ కాసులు పాల్గొనగా, మెగా గ్యాస్ ప్రతినిధులుగా ఎస్.వి.ఎస్. ప్రసాద్, సీహెచ్. ఫణికుమార్ హాజరయ్యారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.వి.ఎస్. లక్ష్మి, సీహెచ్. నాగరాజు, ఎస్.కె. సలీం, ఎక్స్ అఫీషియో సభ్యుడు జూలూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల దాతృత్వం అభినందనీయమని, వారి సేవలను స్ఫూర్తిగా తీసుకుని పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రమేష్ హత్య పై విచారణ వేగవంతం చేయుటకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని

**దళిత సేన డిమాండ్**

**ప్రజాభూమి ఏలూరు.**



దళిత సేన రాష్ట్ర కార్యాలయం ఏలూరులో జరిగిన దళిత సైనికుల సమావేశంలో దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ ఇటీవల దళిత నాయకులు టిఎం రమేష్ హత్యపై సత్వరమే విచారణ జరుపుటకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి సత్వరమే విచారణ పూర్తి చేసి నిందతులకు శిక్ష పడే విధంగా చూడాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వపరంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని విజ్ఞప్తి చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర హోం మంత్రి,రాష్ట్ర ఎస్సీ కమిషన్ దళితులపై హత్యలు దాడులు జరగకుండా పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో ఉంగుటూరు మండల దళిత సైనికులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన పోలవరం శాసనసభ్యులు బాలరాజు

**ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి**



స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యక్రమంలో భాగంగా తాటియాకులగూడెం సచివాలయానికి కేటాయించిన నూతన చెత్త సేకరణ వాహనాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు.పోలవరం నియోజకవర్గంలో స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం తాటియాకులగూడెం సచివాలయానికి కేటాయించిన నూతన చెత్త సేకరణ వాహనాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో ఆయన తండ్రి చిర్రి కృష్ణయ్య ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ ద్వారా గ్రామాల్లో వ్యాధులు నివారించడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంతో ప్రతి గ్రామానికి అవసరమైన వనరులు సమకూర్చుతూ శుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.తాటియాకులగూడెం పంచాయతీ ప్రజలు ఈ వాహనాన్ని సద్వినియోగం చేసుకొని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సచివాలయం ద్వారా నిర్వహించే సేకరణ విధానానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో శాశ్వత శుభ్రత కోసం పంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, పంచాయతీ సర్పంచ్ వనమా రామకృష్ణ, బీసీ సెల్ అధ్యక్షులు రాయి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి చెన్నారావు, చెత్త సేకరణ సిబ్బంది, కూటమి నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి

**జిల్లా వ్యవసాయ శాఖ - అధికారి షేక్ హబీబ్**


**ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట**



కామవరపుకోట మండలం స్థానిక మండల వ్యవసాయ అధికారి వారి కార్యాలయం నందు మండలంలో గల రైతు సేవా కేంద్ర సిబ్బంది తో జిల్లా వ్యవసాయ అధికారి వారు షేక్ హబీబ్ భాషా , సహాయ వ్యవసాయ సంచాలకులు చింతలపూడి వై సుబ్బారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు జిల్లా వ్యవసాయ అధికారి వారు షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ కామవరపుకోట మండలంలో మొత్తం 15096 ల్యాండ్ పార్సెల్స్ కలవని, ఇప్పటివరకు 9863 మాత్రమే బుకింగ్ చేయడం జరిగిందని, ఇంకా మిగి 5233 ల్యాండ్ పార్సెల్స్ ఫిబ్రవరి 25 లోపు నమోదు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి రైతు కూడా తన భూమికి సంబంధించి విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారానే రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు సేవలు ప్రతి రైతు కూడా పొందవచ్చని తెలిపారు. కావున భూమి కలిగిన ప్రతి రైతు కూడా ఆయా గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వారి యొక్క భూమికి విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాల్సినదిగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వ్యవసాయ మరియు అనుబంధ శాఖల పథకాలు రైతుకి అందించాలని ఉద్దేశంతో విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి ముత్యాల మరియు మండలంలో గల రైతు సేవ కేంద్ర సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పోలవరం శాసనసభ్యులు బాలరాజు

**ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి**



జీలుగుమిల్లి లోని వబిలిశెట్టి రవితేజ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు . నూతన వధూవరులు నిండా నూరేళ్లు తో ఆయురారోగ్యం ఐశ్వర్యంతో తులతూగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, మండల ప్రెసిడెంట్ పసుపులేటి రాము,బిజెపి నాయకులు చాట్రాతి ప్రసాద్,ఎంపీటీ నాలి శ్రీనివాస్, పేరాబత్తుల ధనంజయ్, కక్కిరాల ఉపేంద్ర, మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాల పైడిమెట్ట నందు శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించబడినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అంతర్జాతీయ మాతృభాషా గురించి వివరించారు. ఈ ప్రపంచంలో తల్లి పాల తర్వాత అంత తియ్యనైనది మాతృభాష. ఈ సృష్టిలో ఎన్నో జీవరాశులు ఉన్నా అత్యంత ఉన్నతమైన భావవ్యక్తీకరణ నైపుణ్యం కలిగి ఉన్నది మాత్రం మానవుడే. అటువంటి మానవుడు తొలుత మాట్లాడేది తన మాతృభాషలోనే. ఎక్కడైతే మాతృభాష గౌరవించబడుతుందో అక్కడ సంప్రదాయాలు వెల్లువిరుస్తాయి.మన మాతృభాష తెలుగు. దేశ భాష లందు తెలుగు లెస్స అని మన భాష కీర్తించబడిన భాష మనది అని వివరించారు.అనంతరం విద్యార్థులు తెలుగు అక్షరాలు, అచ్చులు, హల్లులు, గుణింతాలు, పొడుపు కథలు, జాతీయాలు, సామెతలు, పద్యాలు, కవితలతో అలరించారు.అని చెప్పారు.ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు ధర్మాన రాము, విద్యార్థులు ఉన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు .

**మందకృష్ణపై రాజద్రోహం కేసు నమోదు చేయాలి**

**గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేత**

**కాజులూరు మాలమహానాడు డిమాండ్**

కాజులూరు, ప్రజాభూమి ప్రతినిధి.



ఇటీవల ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో మందక్రిష్ణ మాదిగ అలియాస్ మందా ఏలియ గారు బి.ఆర్. అంబేద్కర్ గారిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై రాజద్రోహం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాజులూరు మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం. మోహన్ కుమార్ గారికి అందజేశారు.అంబేద్కర్ సేవలు అమూల్యం.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, దళిత, బలహీన వర్గాల ఆరాధ్యదైవంగా భావించే భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అమూల్యమని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, ఓటుహక్కు, రిజర్వేషన్లు, మహిళా హక్కుల సాధనలో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు.అవమానకర వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇటీవల జరిగిన టీవీ ఇంటర్వ్యూలో మందకృష్ణ మాదిగ అంబేద్కర్ గారిని బ్రిటిష్ ఏజెంట్‌గా పేర్కొనడం, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని వ్యాఖ్యానించడం వంటి మాటలు ఆయన గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు అంబేద్కర్‌ను ఆరాధించే వర్గాల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఇలాంటి వ్యాఖ్యలు వర్గాల మధ్య ఉద్రిక్తతలు, కుల ఘర్షణలు రేకెత్తించే ప్రమాదం ఉందని, ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భీమ్ రావ్ రాంజీ సంక్షేమ సంఘం నాయకులు కూటి రంజిత్ కుమార్, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, మాజీ సర్పంచ్ పోతురాజు బాబూరావు, పోతు శ్రీను మాస్టారు, రొక్కాల సత్తిబాబు, నిమ్మితి విజయ్, రంపాల రాజు, తరుణ్, గుడే శ్రీనివాస్, నాగాబత్తుల పావన మూర్తి, మాత వెంకటేశ్వర్లు, ఊడా అబయ్, ఊడా నాని, పులగల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు వినతిపత్రం సమర్పణ అనంతరం "జోహార్ డాక్టర్ అంబేద్కర్", "భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జోహార్" అంటూ నినాదాలు చేశారు.

## ఫిబ్రవరి 23న రాజమహేంద్రవరం మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా




**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు**

**--- జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్**

రాజమహేంద్రవరం ప్రజా భూమి ప్రతినిధి

తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో ఫిబ్రవరి 23వ తేదీ (సోమవారం ) ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరీష్ చంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళాలో సెంటర్ ఫర్ స్కిల్స్ డెవలప్మెంట్, సిద్ధి డీగ్రీ కళాశాల, టీంలీజ్, పద్మావతి ట్రేడర్స్ మరియు ఎమ్ సి వి మోటార్స్ కంపెనీలోని రాజమండ్రి పరిసర ప్రాంతంలో గల పలురకాల పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని ఆయన తెలిపారు.10, ఐ టీ ఐ, డిప్లొమా, నుండి ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన, అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా వఎజూశ్రీశీఎవత్.ఖజూ.స్త్రశీజ.ఱఅలింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ మరియు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్ తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్ర సాధన దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

కాకినాడ రూరల్, ప్రజాభూమి ప్రతినిధి:



పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరేలా ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర సాధన దిశగా అడుగులు వేయాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. శనివారం కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో జరిగిన స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ర్యాలీ నిర్వహించారు. క్లాప్ మిత్రులతో కలిసి అక్కడ ప్రదేశాలను, మురికి కాలువను శుభ్రం చేశారు. ప్రజలతో మాట్లాడి గ్రామంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న తడి, పొడి చెత్త సేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటిస్తున్న స్వచ్ఛ రథం పనితీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ అపూర్వ భరత్.. అధికారులతో కలిసి గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్డబ్ల్యూపీసీలో తయారైన వర్మి కంపోస్టును ఈ సందర్భంగా జేసీ స్వయంగా కొనుగోలు చేశారు. వర్మీ కంపోస్ట్ వినియోగంపై స్థానికులకులను అడిగి తెలుసుకుని స్థానికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు స్థానిక ప్రజలతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛా గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను నిర్మూలించేందుకు ప్రతినెల ఒక్కొక్క అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తుందన్నారు. “జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్” అనే నినాదంతో ఫిబ్రవరి నెల కార్యక్రమాలు నిర్వహించు కుంటున్నామన్నారు. ఈ కార్యక్రమాలలో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులు విద్యార్థులను భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తలను వేరుగా సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాలు కాకినాడ జిల్లాలో ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నాయన్నారు. ఈ స్వచ్ఛ రథాలు ద్వారా గృహాల్లో ఉపయోగించని ప్లాస్టిక్, ఇనుము ఇతర వస్తువుల బదులుగా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని జేసీ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరేలా ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర సాధన దిశగా అడుగులు వేయాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాకినాడ డివిజనల్ అభివృద్ధి అధికారి వాసుదేవరావు, కాకినాడ రూరల్ మండలం ఎంపీడీవో పి.సతీష్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాజులూరులో కానరాని స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు.



**పంచాయతీల ముంగిట్లో కానరాని ముగ్గులు .**

**ఎక్కడ చెత్త అక్కడే దర్శనం.**

**మంజేరులో మురికి కూపంలా కచ్చాడ్రైయిన్.**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శులు.**

**పారిశుద్ధ్యంపై సర్పంచ్ లకు సైతం పెట్టని బాధ్యత.**

**జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు.**

కాజులూరు, ప్రజా భూమి ప్రతినిధి.



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇలాకాలో శనివారం కాజులూరు మండలంలో పలు గ్రామాలు దూరంగా ఉన్నాయి. దీంతో కాకినాడ జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇవేమీ పట్టనట్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు సైతం బాధ్యతగా చేపట్టాల్సిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమం కాజులూరు మండలంలో అధికారుల నిర్లక్ష్యానికి గురై కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు చేసారు. దీంతో మండలంలో పలు గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడే రోడ్లు, వీధుల్లో దర్శనమిచ్చాయి . మంజేరు గ్రామంలో అయితే హంసగుడి ప్రాంతంలో కచ్చాడ్రైయిన్ మురికికూపంలో దుర్గంధంగా భరితంగా తయారైంది. కనీసం పంచాయతీల ముంగిట్లో ముగ్గులు సైతం వేయకపోవడం ఈ కార్యక్రమాన్ని అధికారులే అపహాస్యానికి గురి చేసినట్లు తావిస్తుంది. ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు గుట్టు చప్పుడు కాకుండా ఫోటోలు ఫోజులు ఇచ్చి కార్యక్రమానికి మేము సైతం అంటూ ఇప్పటి వరకూ ఎన్నో సందర్భాల్లో జరిగినా ప్రస్తుతం అలా కూడా చేయకపోవడం అధికారుల ఆంతర్యం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.జిల్లాలో ఈ నెల 21న ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రభావవంతంగా పటిష్టమైన రీతిలో నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించడంలో బాగంగా కాజులూరు మండలంలో పలు గ్రామాల్లో ఈకార్యక్రమం చేపట్టకపోవడం పలు విమర్శలకు దారితీసింది “జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్” అనే థీమ్ తో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాల్సిఉండగా ఇందుకు సంబంధించిన అధికారులు దూరంగా ఉన్నారు.ఈకార్యక్రమాని సంబంధించి ముందు రోజు ప్రజలందరికీ తెలిసే విధంగా టాం టాం, మైక్ అనౌన్స్మెంట్ లు ద్వారా ప్రచారం చేయించి, శనివారం రోజున జరిగే కార్యక్రమాల, ప్రదేశాల వివరాలు ప్రజలందరూ అందరికీ తెలిసేలా చేయాలి కాని కార్యక్రమే చెప్పకపోవడం అదికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో శుభ్రపరచడంతో పాటు వేస్టుకు సంబంధించిన వస్తువులను సేకరించి ఒక చోట ఉంచాలన్నా ఆదేశాలు ఉన్నాయి. అన్ని మేజర్ మరియు హెడ్ క్వార్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సంస్థలు , ప్రజల నుండి వేస్టును సేకరించాల్సి ఉంది . స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సంస్థలు ప్రజలు అందరూ ఈ కార్యక్రమంలో చైతన్యంతో పాల్గొని ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ఒక యజ్ఞంలా నెలలో ప్రతీ మూడవ శనివారం చేరాలని స్పష్టంమైన ఆదేశాలు జారీచేసింది.దీంతో జిల్లా ఉన్న అధికారులు సైతం ముందు రోజే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.వ్యర్థాల నియంత్రణపై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి గ్రామపంచాయతీలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర ఫిబ్రవరి నెల థీమ్ పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలనన్నారు. కాలుష్యాల కారణంగా దెబ్బతింటున్నపర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కృషిలో ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యలను చేయాలని కోరారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ యార్డు, రైతు బజార్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా శాఖల ద్వారా నిర్వహించిన కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు తీసి స్వచ్ఛాంధ్ర వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాల్సి ఉండగా నామమాత్రపు కార్యక్రమాలతో ఫోటోలకు ఫోజులిచ్చి కార్యక్రమాన్ని మామా అనిపించి చేతులు దులుపుకుంటున్నారు ప్రభుత్వ ఆశయానికి పలువురు అదికారుల నిర్లక్ష్యానికి తూట్లు పడుతున్నాయనడంలో ఏమాత్రం సందేహం లేదు వైపులేదు.ఇందుకు నిదర్శనం శనివారం చేపట్టాల్సిన స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం కాజులూరు మండలంలో పలు గ్రామాల్లో చేపట్టకపోవడమే చెప్పవచ్చు.ఇది ఇలాఉండగా కొన్ని సచివాలయల్లో అయితే సిబ్బంది కుంటిసాకులుతో విధులకు డుమ్మా కొట్టి గైర్హాజరు కావడం కొసమెరుపు.

## మంద కృష్ణ మాదిగను అరెస్టు చేయాలి

**- డాక్టర్ అంబేద్కర్ ను కించపరిస్తే సహించేది లేదు**

**- మందకృష్ణ మాదిగ దిష్టిబొమ్మ దగ్ధం,**

ఉప్పలగుప్తం ప్రజాభూమి ప్రతినిధి,,,



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని కించపరిచే విధంగా టీవీ డిబేట్ లలో బహిరంగ సభల్లో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ పై దేశద్రోహం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా దళిత సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఉప్పలగుప్తం మండల కేంద్రంలో శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలోనిరసన ప్రదర్శన నిర్వహించి మంద కృష్ణ మాదిగ దిష్టి బొమ్మ దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు,.ఖబడ్దార్ ముందా కృష్ణ మాదిగ మందా కృష్ణ మాదిగ మనువాద నీచ రాజకీయాలు నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ బిజెపి ఆర్ఎస్ఎస్ మనవాదు లకు చెంచాగిరి చేస్తున్న మంద కృష్ణ మాదిగ చరిత్రను వక్రీకరిస్తూ డాక్టర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని మంద బుద్ధితో మదమెక్కి మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగకు మతిభ్రమించిందని డాక్టర్ అంబేద్కర్ ప్రసాదించిన రిజర్వేషన్ అనుభవిస్తూ అదే అంబేద్కర్ ని దురుద్దేశంతో తన స్వార్థం కోసం విమర్శిస్తున్నాడని మందకృష్ణ నోరు అదుపులో పెట్టుకోకపోతే సహించేది లేదని తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు, ఇప్పటికైనా మందకృష్ణ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని డాక్టర్ అంబేద్కర్ కి క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు అంబేద్కర్ అభిమానులతో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు రాజ్యాంగ నిర్మాతను అవమానించిన మంద కృష్ణ మాదిగ కు ఇచ్చిన పద్మశ్రీ అవార్డు రద్దు చేయాలని అంబేద్కర్ కి క్షమాపణ చెప్పేంతవరకు అంబేద్కర్ కోనసీమ జిల్లా లో పర్యటించే అవకాశం కల్పించరాదని డిమాండ్ చేశారు. అనంతరం మంద కృష్ణ మాదిగ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుక పట్ల రఘుబాబు విధసం రాష్ట్ర కో కన్వీనర్ రేవు తిరుపతిరావు ఉప్పలగుప్తం సర్పంచ్ కడిమి చిన్నవరాజు జనసేన నాయకులు తాళ్ల రవి. బీఎస్పీ నాయకులు పెయ్యల ప్రతాప్. మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి.ముత్తా బత్తుల శ్రీనివాసరావు. పందు రాజేష్ .ఇసుక పట్ల బాబులు.అయితా బత్తుల భాస్కరరావు నడింపల్లి సుబ్బరాజు కుంచే బాబులు.వి మల్లేష్ .బడుగు శ్రీను చీకురుమల్లి సువర్ణ రాజు కొల్లి శ్రీను. మధుర దొరబాబు. తదితరులు పాల్గొన్నారు,

## అశ్లీన నృత్యాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



అస్లీల నృత్యాలు ప్రోత్సహిస్తూ, శుభ కార్యక్రమాల్లోనూ, వివిధ వేడుకల్లో హిజ్రాలు తో ప్రదర్శనలు నిర్వహిస్తే, అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ హెచ్చరించారు. ఈ కోవకు చెంది తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామం లో ఓ వివాహ వేడుక సందర్భం లో హిజ్రాలతో అస్లీల నృత్యాలు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీస్ లు ఆ నృత్యాలు నిలుపుదల చేసి సంబంధిత వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## భక్తులతో షోభిల్లిన కోనసీమ తిరుమల వాడపల్లి

**గోవింద నామస్మరణతో మారుమోగిన మాడవీధులు.**

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.



ఆధ్యాత్మిక దివ్య క్షేత్రం, కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన భక్తులతో కిక్కిరిసింది. కాలినడకన వచ్చే భక్తులు శుక్రవారం రాత్రికే ఆలయ ప్రాంగణానికి చేరుకొన్నారు. తెల్లవారు జామున మొదలయ్యే సుప్రభాతసేవ మొదలుకుని రాత్రి వరకు స్వామివారిని భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి దర్శించుకున్నారు. తిరుమాడ వీధుల్లో వేల సంఖ్యలో భక్తులు ఏడు ప్రదక్షణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆలయ పాలక మండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు దగ్గరుండి పర్యవేక్షించారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించి అన్నప్రసాదం స్వీకరించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాద కేంద్రం వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావులు చర్యలు తీసుకున్నారు.

## అంబేద్కర్ ను అవమానిస్తే సహించబోము



**ఆత్రేయపురం మండల దళిత జేఏసి నాయకుల హెచ్చరిక.**

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించేలా మందకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ బొమ్మను తగలబెడుతూ నిరసన వ్యక్తం చేసినట్లు దళిత జేఏసి నాయకుడు కప్పల శ్రీధర్ పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మాలల జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం ఆత్రేయపురం మండల కేంద్రంలో అన్ని గ్రామాల నుంచి వచ్చిన దళిత నాయకులతో కలిసి మందకృష్ణ మాదిగ రాజ్యాంగ నిర్మాతపై చేసిన వ్యాఖ్యలను క్రిమినల్ ప్రొసీజర్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసినట్లు శ్రీధర్ పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ ఉన్మాదంతో ఆర్ఎస్ఎస్ ఏజెంట్ల మనువాదానికి తొత్తులా వ్యవహరిస్తున్న నీవు అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలు యావత్ సమాజం నిన్ను ఛీ కొడుతుందని, తక్షణమే కృష్ణ మాదిగ క్షమాపణ చెప్పాలని అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ నిర్మాత పై చేసిన వ్యాఖ్యలను సుమోటో గా తీసుకొని రాజు ద్రోహ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఆత్రేయపురం పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ పత్రం సిబ్బంది కి అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కుసుమ ప్రవీణ్, కాకి సూరిబాబు, వీరవల్లి విక్రమ్, సరేల్ల పండు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర లక్ష్యంగా రావులపాలెంలో స్వచ్ఛ రథం ప్రారంభం

**దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్నంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వం.**

**ప్రజలు స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలి.**

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.



రావులపాలెం మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెత్త నుంచి సంపద సృష్టించే “వేస్ట్ టు వెల్త్” ఆలోచనతో స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. స్వచ్ఛ రథం ద్వారా సేకరించిన వ్యర్థాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం డబ్బులు లేదా నిత్యావసర వస్తువులు అందజేస్తారని తెలిపారు. కిలో ఇనుపకు రూ.20, అల్యూమినియంకు రూ.120, స్టీల్‌కు రూ.40, అట్ట పెట్టెలకు రూ.10 చెల్లిస్తారని వివరించారు. ప్రస్తుతం రావులపాలెం మండలంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, త్వరలో ఇతర మండలాల్లో కూడా అమలు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## తిరుమల లడ్డూ కల్తీ అంశంలో పట్టుబడి వైసీపీ తప్పుల మీద తప్పు చేస్తుంది

**శాసనమండలిలో వేంకటేశ్వరస్వామి చిత్రపటాలకు అపచారంపై ఎమ్మెల్యే ఆగ్రహం.**

**హిందూ సమాజానికి జగన్, వైసీపీ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలి - ఎమ్మెల్యే బండారు డిమాండ్.**

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.



గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన లడ్డూ కల్తీ అంశాన్ని కప్పిపుచ్చుకోవడానికి వైసీపీ నాయకులు తప్పులు మీద తప్పులు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆరోపించారు. శాసనమండలిలో స్వామివారి చిత్రపటాలకు జరిగిన అపచారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనమండలిలో వైసీపీ నాయకులు చెప్పులు, బూట్లు ధరించి వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను ప్రదర్శించడం, అనంతరం వాటిని విసిరివేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. దీనికి నిరసనగా శనివారం రావులపాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి క్షమాపణ కోరినట్లు తెలిపారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంలో ఒక తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరో తప్పు చేస్తున్నారని, ఈ విషయంలో వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు హిందూ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దైవంపై అపహాస్యం చేసేలా ప్రవర్తించడం సమంజసం కాదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యా బాల మందిర్ లో ఘనంగా కవలలు దినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.



డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు లో కవలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్కూల్లో చదువుతున్న కవలలు బొమ్మి సౌమ్య, బొమ్మి సుజిత్ ( 1 వ తరగతి), కుడిపూడి శైలు కుడిపూడి శ్రావ్య (2 వ తరగతి), రామోజు జయమణి విమల రామోజు జయమణి ముద్ర (8 వ తరగతి) వీరిని పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ ఆశీర్వదించి అక్షింతలు వేసి అభినందనలు తెలిపారు. ఒకే అండం ఫలదీకరణం చెంది రెండు గా విభజితమైతే ఐడెంటికల్ ట్విన్స్ పుడతారు అని, రెండు వేర్వేరు అండాలు రెండు శుక్ర కణాలతో ఫలదీకరణం చెందితే ఫ్రాటెర్నల్ ట్విన్స్ పుడతారు అని జీవశాస్త్ర ఉపాధ్యాయులు బూసి శ్యామల తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు కవలలు ను అభినందించారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

ఆదివారం 22 ఫిబ్రవరి 2025


## గుట్టురట్టు చేసిన అనంతపురం త్రీటౌన్ పోలీసులు

ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం



రూ. 25 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు రెండు మోటార్ సైకిల్స్ స్వాధీనం ఇద్దరు అంతర్ జిల్లా దొంగలు అరెస్టు చేశారు. ఈ ఇద్దరిలో ఒకరు పాత నేరస్థుడు ఇతనిపై సుమారు 15 కేసులు, గుట్టురట్టు చేసిన అనంతపురం త్రీటౌన్ పోలీసులు జిల్లా ఎస్పీపి.జగదీష్ ఆదేశాలతో శనివారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించిన అనంతపురం అర్బన్ డీఎస్పీ అరెస్టయిన నిందితులు వివరాలు బాష అలియాస్ కురుబ రామాంజినేయులు, వయస్సు 26 సం. నవోదయ కాలనీ, అనంతపురము. కాగా ప్రస్తుతం స్థానిక చంద్రబాబు కొట్టాలలో ఉంటున్నాడన్నారు. వల్లెపు ప్రసాద్, వయస్సు 29 సం.లు, శ్రీరామ్ నగర్, చిన్న చౌక్, సబ్-జైల్ దగ్గర కడప. స్వాధీనం సొత్తు వివరాలు బంగారు ఆభరణాలు నెక్లెస్‌లు, గొలుసులు, ఉంగరాలు, కమ్మలు, మాటీలు 143 గ్రాములు, వెండి ఆభరణాలు కడియాలు, కాళ్ల పట్టీలు సుమారు 500 గ్రాములు ఉన్నాయన్నారు. దొంగలు ఉపయోగించిన వాహనములు హోండా యాక్టివా, సిబి షైన్ వీటి విలువ మొత్తం 25 లక్షల రూపాయలు దాకా ఉంటుందన్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లను ముందుగా గమనించడం, యజమానులు బయటకు వెళ్ళిన సమయాన్ని నిర్ధారించడం, రాత్రి వేళల్లో తక్కువ రాకపోకలున్న ప్రాంతాలను లక్ష్యంగా ఎంచుకోవడం ఇనుప రాడ్లు, కట్టర్లు ఉపయోగించి తాళాలు, బీరువాలు పగులగొట్టడం వీరి పని అన్నారు. కేవలం బంగారు, వెండి ఆభరణాలను మాత్రమే అపహరించడం దొంగ సొత్తును దాచిపెట్టి, అమ్ముకోవడం నేర సమయంలో వాహన నంబర్ ప్లేట్‌ను కప్పి గుర్తింపుకాకుండా జాగ్రత్తలు తీసుకోవడం నిందితుడు బాష బేల్దారి పనులు చేస్తూ జీవనము సాగించేవాడు. అతను చేసే పని వలన వచ్చే డబ్బులు అతని జల్సాలకి సరిపోనందున, తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు చేసి సులభంగా డబ్బులు సంపాదించుకోవచ్చు అని భావించేవాడన్నారు. గతంలో గుంతకల్ టౌన్, అనంతపురము 1వ టౌన్, 3వ టౌన్, 4వ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిదిలో దొంగతనాలు చేయగా అనంతపురము 4వ టౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకి పంపారన్నారు. ఆ దొంగతనం కేసులలో కొన్ని కేసులు కొట్టివేశారు, కొన్ని కేసులలో శిక్షలు పడ్డాయి. పామిడి పోలీస్ స్టేషన్ ఫోక్ స్కో కేసులో కోర్టు వారెంటు పై అరెస్టు చేసి కడప జైలు కి పంపగా అక్కడ వల్లెపు ప్రసాద్ తో పరిచయం ఏర్పరుచుకొని, జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత ఇద్దరు కలిసి కడప టౌన్ లో రెండు మోటార్ సైకిల్ లు, మూడు ఇండ్లలో దొంగతనాలు చేశారన్నారు. గుత్తి, బుక్కరాయసముద్రం, అనంతపురము 1 టౌన్, 3 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు చేసి, దొంగలించిన బంగారు ఆభరణాలను బాష ఇంటిలో దాచి పెట్టి వాటిని అమ్ముకుందాము అని అనంతపురము టౌన్ లోకి వారు దొంగలించిన మోటార్ సైకిల్స్ లలో వస్తూ వుండగా పట్టు పడ్డారన్నారు. బాష ఉరఫ్ కురుబ రామాంజినేయులు పాత నేరస్తుడు. ఇతనిపై ఇప్పటి వరకు 15 కేసులు ఉన్నాయిన్నారు. ఇందులో ఇళ్ల దొంగతనాలతో పాటు ఫోక్సో కేసు, మర్డర్ కేసు కూడా ఉన్నాయిన్నారు. తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లలో దొంగతనాలు జరుగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బృందాల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ క్రమంలో శనివారం స్థానిక నడిమివంక వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో హోండా యాక్టివా, సిబి షైన్ పై వారు అనుమానాస్పదంగా వస్తూ ఉండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా అప్రమత్తమయ్యారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సి.ఐ లు రాజేంద్రనాథ్ యాదవ్, జయపాల్ రెడ్డి, శేషగిరి, రామగిరి రామయ్య, ఎస్సైలు రాజశేఖర్ రెడ్డి, తులశన్నల ఆధ్వర్యంలో అనంతపురం త్రీటౌన్, సిసిఎస్ పోలీసు సిబ్బంది సంయుక్తంగా వీరిని అరెస్టు చేశారు.




## సమస్యల పరిష్కారం కోసం - రా కదలిరా ఎస్ టి యు

ప్రజాభూమి ,ఎన్ పి కుంట



ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల కోసం నిర్వహిస్తున్న ధర్నాకు ఉద్యోగస్తులు కదలి రావాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీల అమలు చేయాలంటూ ఈనెల 25న ఎస్ టీ యు సమరశంఖం పేరుతో విజయవాడ నందు మహా ధర్నా నిర్వహిస్తున్నామని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు గజ్జల హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈరోజు స్థానిక మండల వనరుల కేంద్రం నందు సమర శంఖం పోస్టర్లు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు లక్ష్యంగా మేనిఫెస్టో సాక్షిగా హామీలు ప్రకటించి అందలమెక్కిన తర్వాత అమలు విస్మరించడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. 12వ పిఆర్సీ కోసం సంవత్సరాల తరబడి ఉద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదని, పెరుగైన పిఆర్సీ ప్రకటిస్తామన్న మాటలు నీటి మూటలయ్యాయని, వెంటనే పిఆర్సీ కమిషన్ను నియమించి నష్ట నివారణ చర్యలో భాగంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. . సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పెరుగైన పెన్షన్ విధానం ప్రకటిస్తామని చెప్పి ఊరించి నేడు మౌనం వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంటనే సిపిఎస్ జిపిఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.పదవీ విరమణ చేసిన మరుసటి రోజే అన్ని పెన్షన్ ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీలు, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వెంటనే మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ధనుంజయ రెడ్డి, రమేష్ కుమార్, పర్వత రెడ్డి, పూర్ణానంద రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులు రెడ్డి, విశ్వ మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, లాలూ సాబ్, సుదర్శన్ గోపాల్, స్రవంతి, బీబీ అయేషా, రుక్షాణా, శ్రీలక్ష్మి, సాయి లీల, జ్యోతి, వనజ, రేణుక భాయి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ సమస్యలను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోండి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను రికవరీ చేసే విషయంలో రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, న్యాయవాదులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మార్చి 14వ తేదీన మెగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న బకాయిలకు సంబంధించి నోటీసులు జారీ చేసి రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొని అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ఆయా బ్యాంకర్లు ముందుగానే రుణాలు తీసుకున్న వ్యక్తులకు నోటీసులు అందజేయాల్సి ఉంటుందన్నారు. సాధ్యమైనంత ఎక్కువగా సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్, బిఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థ కూడా రాజీ మార్గంలో కేసులను పరిష్కారం ఇస్తే నోటీసులు అందజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. ఇకపోతే న్యాయవాదులు కూడా కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా లోక్ అదాలత్ లో సివిల్ కేసులకు కనీస స్థాయిలో పరిష్కరించేందుకు ముందుకు రావాలని సూచించారు. దీనికి తోడు భరణం, ప్రమాద బీమా తదితర రాజీ కాదగిన కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకుల మేనేజర్లతో పాటు ఏపీపీ గోపాలకృష్ణ, ఏజీపీ రామచంద్రప్ప, న్యాయవాదులు సుదర్శన్, రాజశేఖర్, సిద్ధు, శ్రీనివాస్ రెడ్డి, కోదండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలి

**-ఉచిత న్యాయం కోసం దరఖాస్తు చేసుకోండి**

**-సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



జైలు నుండి బయటకు వెళ్లిన తర్వాత ప్రవర్తనలో మార్పు రావాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలో ఉన్న రిమాండ్ ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటి నుండి కారాగారంలో ఉంటున్నారు, న్యాయవాదులు ఉన్నారా లేదా అన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జైలులో భోజన సౌకర్యం, వైద్య సదుపాయాలు తదితర వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ, చాలామంది క్షణికావేశంలో తప్పులు చేసి కారాగారాలకు రావడం జరుగుతోందన్నారు. అయితే ఇక్కడి నుండి వెళ్ళిన తర్వాత కచ్చితంగా ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. ఆవేశం, కోపాలను తగ్గించుకుంటే నేరం చేసే అవకాశం ఉండదన్నారు. కారాగారాలకు రావడం వల్ల ఆర్థికంగా దెబ్బ తినడంతో పాటు ఆయా కుటుంబాలకు సమాజంలో గౌరవ మర్యాదలు ఉండమన్నారు. అదే విధంగా కుటుంబ సభ్యులు కూడా చులకనగా వ్యవహరిస్తారని తెలిపారు. ఇకపోతే ఆర్థికంగా వెనుకబాటుతనంగా ఉండి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్న రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందని న్యాయమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ గోపాలకృష్ణ, ఉపకారాగార అధికారి హనుమప్ప, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజా, పారా లీగల్ వాలంటీర్ సురేష్ పాల్గొన్నారు.

## 6 వ తరగతి లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాభూమి, పుట్లూరు.



2026-27 విద్యా సంవత్సరానికి గాను పుట్లూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓబుల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్ లైన్లో ఈ నెల 23 నుండి మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుం ఓసి, బీసీలకు రూ. 200, ఎస్సి, ఎస్టి లకు రూ. 125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు స్థానిక మోడల్ స్కూల్ లో సంప్రదించాలని కోరారు.

## మార్కెట్ యార్డులో రైతులకు ఇబ్బంది కలగకూడదు: ఎమ్మెల్యే దగ్గుపాటి

**మార్కెట్ యార్డులో కమిటీ సభ్యులతో సమావేశం.. హాజరైన ఛైర్ పర్సన్ బల్లాపల్లవి, ఇతర కమిటీ సభ్యులు**

ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

రైతులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంటలు సాగు చేసి మార్కెట్ యార్డుకు దిగుమతులు తీసుకొస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం గుత్తి రోడ్ లోని మార్కెట్ యార్డ్‌లో జరిగిన పాలకవర్గం కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డ్ లో ఉన్న పరిస్థితుల గురించి ఎమ్మెల్యే చర్చించారు. మార్కెట్ యార్డ్ లో గతం కంటే భిన్నంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలకవర్గంలో అనేక తప్పిదాలు, అవినీతి జరిగిందని ఇప్పుడు అలాంటి వాటికి తావు లేకుండా చూసుకోవాలన్నారు. గతంలో ఇక్కడికి వచ్చే రైతులకు, వ్యాపారుల కోసం భోజన సదుపాయం ఏర్పాటు ఉండేదని ఇప్పుడు మరోసారి దీనిని పునః ప్రారంభించేలా చూస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చీనీ మార్కెట్ కు మన మార్కెట్ యార్డ్ ప్రసిద్ధి అని ఇక్కడికొచ్చే రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకూడదన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక్కడ మోసాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మార్కెట్ యార్డ్ లో డ్రైనేజీ సమస్యలు పరిష్కారానికి కూడా కృషి చేయాలన్నారు. పండ్ల మార్కెట్ లో కవర్ షెడ్లు, అలాగే తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి కమిటీ సభ్యులు తీసుకొచ్చారు. కచ్చితంగా వీటికి నిధులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ బల్లా పల్లవి, వైస్ చైర్మన్ అర్షదుల్లాతో పాటు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ, బీటెక్ పూర్తి చేసిన అర్హత గల నిరుద్యోగులకు కస్టమర్ కేర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ (వాయిస్, నాన్-వాయిస్), కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సర్టిఫికెట్ తో పాటు ఉద్యోగావకాశాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. అసక్తి గల నిరుద్యోగులు ఈ నెల 26వ తేదీ లోపు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కె. శివప్రసాద్ 9676706976 నెంబర్లతో సంప్రదించాలని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## తీర్థప్రసాదాలు అందజేసిన చైర్మన్ రమానందన్

ప్రజాభూమి,హిందూపురం టౌన్



లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలు ఐదు రోజుల పాటు ఘనంగా ముగియడంతో ఉత్సవాల నిర్వహణకు సహకారం అందించిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఆలయ చైర్మన్ రమానందన్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో లేపాక్షి దేవాలయ చైర్మన్ రమా నందన్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అర్చకులు శ్రీనివాస్ కుమార్ శర్మలు కలిసి ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ, అధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో ఎప్పటికప్పుడు తమ సహకారం అందిస్తామని తెలిపారు. శిల్పకళా వైభవానికి ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దేవాలయంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఆలయాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే సహకారం కొనసాగుతుందని తెలిపారు.

## రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**-వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసిన సీఐ**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలు లేకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని సిఐ జనార్ధన్ సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కె.వి. మహేష్ నేతృత్వంలో శనివారం లేపాక్షి పోలీస్ స్టేషన్ పరిధిలోని చోళసముద్రం టోల్ ప్లాజా రోడ్డుపై ప్రత్యేక వాహన తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. లేపాక్షి ఎస్ఐ నరేంద్ర పోలీసు సిబ్బందితోకలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా సిఐ జనార్ధన్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించి, నిర్లక్ష్యంగా వాహనం నడిపితే జరిగే ప్రమాదాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ఎంత కీలకమైన పాత్ర పోషిస్తుందో స్పష్టంగా తెలియజేశారు. ఇందులో భాగంగా వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచిమంచి స్పందన లభించింది. భవిష్యత్తులో తప్పకుండా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని వాహనదారులు హామీ ఇచ్చారని సీఐ తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రాణ రక్షణకే హెల్మెట్ ఉపయోగపడు తుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ జనార్ధన్ ప్రజలను కోరారు.

## తిరుమల లడ్డూపై వైసిపి అపవాదాలు శోచనీయం

**-పేట వెంకటరమణ స్వామి**

**ఆలయంలో టిడిపి ప్రత్యేక పూజలు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

తిరుమల లడ్డూ అంశంపై వైసిపి అపవాదాలను టిడిపి నాయకులు ఖండించారు. దీనికి నిరసనగా శనివారం పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి ఆలయంలో టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసిపి నాయకులు తిరుమల లడ్డూ కల్తీ అంశంపై చేస్తున్న అవాస్తవ ప్రచారాలను ఖండించారు. శుక్రవారం శాసనమండలిలో వైఎస్ఆర్సీపి ఎమ్మెల్సీలు చెప్పులు వేసుకుని దేవుడి పటాలను పట్టుకుని పవిత్రమైన మండలిని అపవిత్రం చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేయడం తగదని, పవిత్రమైన తిరుమల ప్రసాదం గురించి నిరాధార ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. శాసన మండలి వంటి గౌరవప్రదమైన వేదికను రాజకీయ ప్రదర్శనలకు వాడుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డి.ఈ. రమేష్ కుమార్, జిల్లా మాజీ అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, జనసేన పార్టీ నాయ కులు అకుల ఉమేష్, జేపీకే రాము, కార్యదర్శి దుర్గ నవీన్, కౌన్సిలర్ రాఘవేంద్ర, లేపాక్షి కన్వీనర్ అభిలాష్, నాయకులు అమర్నాథ్. బాచి, సుమో శీనా, డైమండ్ బాబా, అన్వర్, వెంకటలక్ష్మి, అబూబకర్, జనసేన నాయకులు నిమ్మకాల రాము, చక్రి, శేఖర్, ఐటీడీపీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**-పీడీఎస్ యు: జిల్లా అధ్యక్షులు బాబావలి పిలుపు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 27న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలు, గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న చలో విజయవాడకు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.6,400 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్ షిప్ ప్రతికూలంగా మారిన జీఓ నంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 4,200 పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెరిగిన ధరలకు అను గుణంగా వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్,కాస్మోటిక్ చార్జీలను పెంచి మంజూరు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ లలో విద్యా రంగానికి కనీసం 10 శాతం నుంచి 30 శాతం వరకు నిధులు కేటాయించాలని కోరారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ సర్టిఫికెట్లు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టిస్తున్నాయని అరోపించారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ పట్టణ నాయకులు శశాంక్, భరత్, సుదర్శన్, పునీత్, అజయ్కుమార్, నరేష్, సోము, రాజే ష్ నాయక్, ఆదర్శ్, యోగేష్, కర్రీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపిల్లల ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని ఆర్ పి జి టి రోడ్డులో ఉన్న ప్రణయ్ చిన్నపిల్లల ఆసుపత్రిలో శనివారం ఆసుపత్రి వైద్యులు వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బెంగళూరు రేయిన్ బో ఆసుపత్రి వైద్యురాలు శృతి అలంగట్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న వారితో పాటు అలర్జీ సమస్యలతో బాధపడుతున్న చిన్నపిల్లలను ఈ వైద్య శిబిరంలో ఓపి రుసంతో సుమారు రూ.5 వేలు విలువచేసే అన్ని వైద్య పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు వెంకటరమణ మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవ అన్న నానుడితో పేదలకు సహాయం చేయాలని తలచి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు బెంగళూరు నుంచి ఆయా వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులను తీసుకొచ్చి వైద్య సేవలు అందిస్తున్నానన్నారు. దీంతో పాటు న్యూరాలజీ, గుండె వైద్య నిపుణులతో మరింత మంది వైద్య నిపుణులను తీసుకొని వచ్చి వేలాది రూపాయలు బయట వెచ్చించి చేసే వైద్య పరీక్షలను తమ ఆసుపత్రిలో ఉచితంగా చేసి, వారికి అవసరమైన మందులను అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్తను ఇవ్వండి.. సరుకులను తీసుకోండి

### స్వచ్ఛ రథం ప్రారంభించిన జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయం లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని రూపొందించింది అన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని ప్లాస్టిక్, పాత పేపర్లు, గాజు వస్తువులు ఈవ్యర్థపదార్థాలను ఇంటి వద్దకే వచ్చే స్వచ్ఛ రథానికి అందించాలని తెలిపారు. ఆ వ్యర్థాలను అక్కడికక్కడే తూకం వేసి, వాటి విలువకు సమానమైన నిత్యావసర సరుకులను ప్రజలకు అందజేయడం జరుగుతుం దని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధానంగా మూడు లక్ష్యాలతో ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు. వ్యర్థాలను సంపదగా మార్చడం, పనికి రాని వస్తువుల ద్వారా ప్రజలకు ఆర్థిక వెసులు బాటు కల్పించడం, పరిశుభ్ర గ్రామాలే ధ్యేయంగా ప్రతి గ్రామాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దడం, పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ వంటి ప్రమాదకర వ్యర్థాలను సక్రమంగా సేకరించి పర్యావరణాన్ని కాపాడటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల వైస్ ఎంపీపీ, ఆర్.తుమ్మల పల్లె ఎంపీటీసీ విశ్వనాథ రెడ్డి, పులివెందుల మండల టీడీపీ ఇంచార్జ్ జగన్ మోహన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ అధికారులు , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

### ధ్రువకుమార్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ షర్మిల రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మూలంరెడ్డి ధ్రవకుమార్ రెడ్డి 33వ జన్మదిన వేడుకలను హైదరాబాదులోని లోటస్ పాండ్ వైఎస్ షర్మిల రెడ్డి నివాసంలో ఘనంగా నిర్వహిం చారు. ముందుగా వైయస్ షర్మిల రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి తో కలిసి జన్మదిన కేకును కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ధ్రువ కుమార్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతోఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రజలలో మంచి పేరు తెచ్చుకొని ఉన్నత పదవులను అవరోహించాలని ఆమె ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్ల పంపిణీ



ప్రజాభూమి, ఒంటిమిట్ట:
మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గౌడ సత్య ప్రసాద్, గాయత్రి దంపతుల కుమారుడు చిరంజీవి నిహాల్ శ్రీ ఆర్య పుట్టినరోజు వేడుకలు శనివారం సేవా దృక్పథంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం సమీపంలోని శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో ఉన్న అవ్వాతాతలకు మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. భోజనంతో పాటు వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు, మరియు ఎనర్జీ డ్రింక్స్‌ను పంపిణీ చేశారు. తమ కుమారుని పుట్టినరోజును పురస్కరించుకుని ఆశ్రమంలోని వృద్ధుల మధ్య గడపడం సంతోషంగా ఉందని నిహాల్ తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనఊరికోసం సంస్థ సభ్యులు ఉప్పల రామకృష్ణ, పుత్తా సుధీర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ నిహాల్ శ్రీ ఆర్య భవిష్యత్తులో మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## పులివెందులను చెత్త రహిత పట్టణంగా తీర్చిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల మున్సిపాలిటీని చెత్తరహిత మున్సిపాలిటీ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాల యం సమీపంలో స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జీరో లీట్టర్ గవర్నన్స్ కార్యక్రమాన్ని ఇంచార్జ్ మునిసిపల్ కమిషనర్ ముని కుమార్ అద్వర్యంలో ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు, మునిసిపల్ , సచివాలయసిబ్బందికి, మెప్మా సిబ్బందికి మహిళ కళాశాల విద్యార్థులకు శుభ్రత ప్రాముఖ్యత, చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి అంశాలపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన మునిసిపల్ ఛైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహబూబ్ బాషాలు మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థులు తమ ఇళ్లు, పాఠశాల, పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోని పులివెందుల పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిద్దేందుకు పాటుపడాలని సూచించారు. పట్టణంలో ప్రతి ఇంటికి చెత్త వేసేందుకు మూడు డబ్బాలను ఇచ్చామని, ఆ డబ్బాలలో తడి చెత్త,పొడి చెత్త, హానికరమైన చెత్తలను వేరుచేసి మున్సిపాలిటీ చెత్త వాహనాల కు అందించాలన్నారు. ఈ సందర్భంగా అందరూ కలిసి స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్,లక్ష్మీ భార్గవి,కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాల నారాయణ,మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, సచివాలయ, మునిసిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

### - ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర




ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. శనివారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ఎస్. నాగేంద్ర పాల్గొని, అమ్మ ఒడిలో నేర్చుకునే భాషే మాతృభాష, అందుకే దానిని అమ్మతో పోలుస్తారు అని తెలిపారు. అనంతరం తెలుగు శాఖ అధ్యక్షులు డా.ఎల్.నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ మన భావాలను హృదయానికి హత్తుకునేలా వ్యక్తపరచడానికి మాతృభాషే ఉత్తమ సాధనమని, మాతృభాషలో చదవడం, విద్యాబోధన వల్ల మానసిక వికాసం, సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయల "దేశభాషలందు తెలుగు లెస్స" అనే వాక్యాన్ని ప్రస్తావించారు. అలాగే చరిత్ర అధ్యాపకుడు డా. బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో కొంతమంది ఆంగ్ల భాష ప్రభావంలో మాతృభాషను వదిలేస్తున్నారని, భాష--సంస్కృతులు పరస్పరం ముడిపడి ఉంటాయని చెప్పారు. లైబ్రరీ సైన్స్ విభాగాధ్యక్షులు డాక్టర్ పొట్లన్నగారి మాధవరావు మాట్లాడుతూ భాష సరిహద్దుల్లో పరిమితం అయ్యే అంశం కాదని, అది కన్నతల్లిలాంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా.మల్లేశ్వరమ్మ, షఫీద్దీన్, అరవింద్, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

### - పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత చర్యలు- సీఐ.టి.నరసింహులు




ప్రజాభూమి, వేంపల్లె
స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని సీఐ.టి. నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రతా చర్యలు చేపట్టి చెత్తను తొలగించారు. పోలీసు సిబ్బంది పాల్గొని పరిశుభ్రత ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఐ.నరసింహులు పేర్కొన్నారు. స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తూ ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై.తిరుపాల్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులకు ఉచిత దంత వైద్య శిబిరం



కమాండెంట్ ఆనంద రెడ్డి హర్షం
ప్రజాభూమి, సిద్ధవటం: పోలీసుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా సిద్ధవటం మండలంలోని భాకరాపేట సమీపాన ఉన్న ఏపీఎస్పీ 11వ పోలీస్ బెటాలియన్‌లో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. బెటాలియన్ పరిధిలోని శ్రీ కోదండరామ కళ్యాణ మండపంలో కడపకు చెందిన హరిప్రియ డెంటల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం బెటాలియన్ కమాండెంట్ ఆనంద రెడ్డి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది కోసం ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ దంత ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన సూచించారు. దంత వైద్యుడు డాక్టర్ గణేష్ మాట్లాడుతూ హరిప్రియ డెంటల్ హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత దంత వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి. రాజశేఖర్, దంత వైద్యులు విష్ణు, వివిధ విభాగాల ఆర్ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్ధవటంలో రూ. 1.14 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్ల ప్రారంభం



ప్రజాభూమి, సిద్ధవటం:
మండలంలోని మాధవరం-1 పరిధిలో రూ. 1.14 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, కనీసం ఐదు లక్షలతో కూడా రోడ్లు వేయలేకపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని కొనియాడారు. ఏళ్ల తరబడి రోడ్ల సమస్యతో ఇబ్బంది పడుతున్న తమకు ఈ నూతన రహదారులతో ఊరట లభించిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నేతలు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో టెండర్ల నిర్వహణ

### - ఆలయ కార్యనిర్వహణాధికారి కడప సుభాష్



ప్రజాభూమి, వేంపల్లె
శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలకు సంబంధించిన పూలమాలల సరఫరా హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కుల కోసం శనివారం ఉదయం 10 గంటలకు షీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. ఈ హక్కులు 2026 మార్చి 1 నుంచి 2027 ఫిబ్రవరి 28 వరకు ఒక సంవత్సరం కాలానికి వర్తిస్తాయి. పూలమాలల సరఫరా హక్కు కోసం నలుగురు టెండర్దారులు షీల్డ్ టెండర్లు దాఖలు చేశారు. అందులో కొండవాండ్లపల్లి గ్రామానికి చెందిన కే.విజయకుమార్ రూ.810 కోట్ చేసి లోయస్టు టెండర్దారునిగా నిలిచినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కడప సుభాష్ తెలిపారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం ఎవరూ డిపాజిట్ చెల్లించకపోవడంతో టెండర్ ప్రక్రియను వాయిదా వేసినట్లు ఆయన వివరించారు. టెండర్ల ప్రక్రియను ప్రొద్దుటూరు డివిజన్ దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పి.వి.రమణ, పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## లతీఫ్ ను పరామర్శించిన మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల టౌన్
పులివెందుల పట్టణంలో ఇటీవల కౌన్సిలర్ ఖాదర్ భాష సోదరుడు లతీఫ్ ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటు న్న లతీఫ్ ను శనివారం మున్సిపల్ వైకాపా ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, వైకాపా నాయకులు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.
ఈ సందర్భంగా బాధితుని ఆరోగ్య పరిస్థితిని ఆయనఅడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వైకాపా పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో,పట్టణ అధ్యక్షు డు హాల్ గంగాధర్ రెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్ ,పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ ఛైర్మన్ రసూల్, నూరుల్లా, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ మిథున్ రెడ్డి,మాజీ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డిల సహకారంతో వికలాంగ కార్యకర్తకు ఎలక్ట్రిక్ మూడు చక్రాల స్కూటర్ అందజేత



ప్రజాభూమి అన్నమయ్య బ్యూరో
రామాపురం మండలం కల్పనాయుని చెరువు గ్రామం గాలం గుండ్ల పల్లెకు చెందిన ఎస్సీ కులానికి చెందిన వైఎస్ఆర్‌సిపి సీనియర్ కార్యకర్త జనార్దన్ పార్టీని ప్రాణంగా చూసుకునే వీరవిధేయుడు. గతంలో జరిగిన ప్రమాదంలో ఆయన ఒక కాలును కోల్పోయారు. ఆ క్లిష్ట సమయంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆయన కుటుంబానికి అండగా నిలవడంతో పాటు బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందజేశారు. ఆ ట్రైసైకిల్ ద్వారా జనార్దన్ సమీప ప్రాంతాలకు వెళ్లి తన పనులను నిర్వహించు కునేవారు. ఇప్పుడు ఆయనకు మరింత సౌకర్యం కల్పించేందుకు రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి సహకారంతో రూ. లక్షకు పైగా విలువ చేసే ఎలక్ట్రిక్ మూడు చక్రాల స్కూటర్‌ను శనివారం వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన జనార్దన్‌కు తోడుగా నిలిచి ధైర్యం ఇచ్చారు. ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రటడ్డిలకు కృతజ్ఞతలు తెలిపిన జనార్దన్ ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు అన్ని విధాలుగా మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అండగా నిలిచారని జనార్దన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ మూడు చక్రాల స్కూటర్‌ను అందించిన ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్దన్ ఫోన్ ద్వారా ఎంపీ మిథున్ రెడ్డితో మాట్లాడి హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. గత జగన్ ప్రభుత్వంలో రాయచోటి నియోజకవర్గంలో వికలాంగులకు ఎంపీ మిథున్ రెడ్డి సహకారంతో వేలాది మందికి ట్రైసైకిళ్లు, బ్యాటరీ త్రీ వీలర్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు అందజేసి అండగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నాగరాణి బాబు, సర్పంచ్ వెంకట్రామి రెడ్డి,నాయకులు చలపతి,శంకర్,శివ,గురుబాబు,నాగరాజు, ఆదిరెడ్డి,బాబిరెడ్డి,చక్రపాణి,కాశీనాయన తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల మండలంలో కస్తూరిబా స్కూల్ లో ట్రస్ట్ ఆధ్వర్యంలో అధినేత, మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. శనివారం దాదాపు 120 మంది విద్యార్థులకు ఉచితంగా గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్ యొక్క రకాలు వాటి ప్రాముఖ్యత, విద్యార్థుల ఆరోగ్య సమస్యలు పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు శారీరకంగా మానసికంగా ఉల్లాసంగా వున్నప్పుడే ఆరోగ్యం బాగుటుంది అని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి కాలేజీని మండలంలోనే ప్రధమ స్థానంలో నిలపాలి అన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్ను రాజ శేఖర్, టేకురుపేట సర్పంచ్ రమణారెడ్డి, వైసిపి పోరుమామిళ్ల టౌన్ అధ్యక్షులు తులసి సురేష్, ప్రిన్సిపాల్ నాగ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి పుట్టినరోజు వేడుకలు

### వైసిపి స్టేట్ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



ప్రజాభూమి పోరుమామిళ్ల :
కాశి నాయన మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ ఆశ్రమంలో అనాధలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని వైసిపి స్టేట్ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనాధలకు ప్రేమతో భోజనం వడ్డించి, సేవా భావంతో వారి ఆశీస్సులు స్వీకరించారు. నాయకుడి పుట్టినరోజును సేవా దినోత్సవంగా జరుపుకోవడం సమాజానికి ఆదర్శమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ స్ఫూర్తితో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, పోరుమామిళ్ల మండల పార్టీ అధ్యక్షులు సీఎం భాష, కాశి నాయన మండలం పార్టీ అధ్యక్షులు హనుమంతు రెడ్డి, జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జిల్లా మరియు మండల అనుబంధ నాయకులు తులసి సురేష్, మధుసూదన్ రెడ్డి, గంటా రమణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సూర్య ప్రసాద్ , సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా, సేవా స్ఫూర్తితో సాగింది.

## వైవీయూను సందర్శించిన పార్వతీపురం ఎస్.పీ.బీ.వీ.డీ.సభ హైస్కూల్ విద్యార్థులు



ప్రజాభూమి, సిద్ధవటం:
కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని సిద్ధవటం మండలం, పార్వతీపురానికి చెందిన ఎస్.పీ.బీ.వీ.డీ.సభ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. విద్యా పర్యటనలో భాగంగా విద్యార్థులు వర్సిటీలోని ఫైన్ ఆర్ట్స్ విభాగం, జియాలజీ విభాగం మరియు బొటానికల్ గార్డెన్‌లను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఫైన్ ఆర్ట్స్ విభాగం హెడ్ శ్రీ మృత్యుంజయ రావు, చినరాయలు మరియు జియాలజీ, సైకాలజీ విభాగాల అధిపతి లాజర్ విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ఫైన్ ఆర్ట్స్ లోని కళాఖండాలు, జియాలజీలోని శిలలు, బొటానికల్ గార్డెన్‌లోని విభిన్న మొక్కల ప్రాముఖ్యతను వారికి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మరియు హెడ్ మాస్టర్ ఎం.డి. మధుసూదన్, సైన్స్ టీచర్ విశ్వనాథ్ రావు, ఇతర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

ఆదివారం 22 ఫిబ్రవరి 2025

# రాష్ట్రస్థాయి శాప్ చెస్ లీగ్ ప్రారంభోత్సవం

## ముఖ్యఅతిథిగా శాప్ చైర్మన్ రవి నాయుడు

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి

ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి శాప్ చెస్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు మరియు తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ






అధ్యక్షులు శ్రీమతి పనబాక లక్ష్మి తో కలిసి శాప్ చైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రీడలకు కొత్త దిశ, కొత్త ఆలోచన, కొత్త ఉద్యమంగా శాప్ లీగ్ రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా అభివృద్ధి లక్ష్యంగా శాప్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ లీగ్‌లో భాగంగా తిరుపతిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లీగ్ లో రాణిస్తున్న ప్రతిభావంతులను వెలికి తీసి, రానున్న రోజుల్లో శాప్ అకాడమీల్లో ప్రవేశాలు కల్పించడమే ఈ లీగ్ ప్రధాన లక్ష్యమని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 17, 2026న రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా స్థాయి చెస్ ఎంపికలు నిర్వహించగా, 2,445 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. “ఇది కేవలం ఒక లీగ్ కాదు... ఇది ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తుకు వేసిన పునాది” అని రవి నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్ , తిరుపతి గంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శ్రీమతి మౌర్య ఐఏఎస్ , శాప్ ఎండి శ్రీమతి భరిణి ఐఎఫ్ఎస్సి, ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటా వాసు, తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సభ్యులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సభ్యులు, క్రీడాకారులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా రాగిగుంట జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి కేవీబీపురం

జెడ్పీహెచ్ఎస్ రాగిగుంట, కే.వి.బి. పురం మండలంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో, శ్రీమతి ఆర్. శ్రీలక్ష్మి మరియు





కె.సుహాసిని ఇతర ఉపాధ్యాయులతో కలిసి విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక జాతి మనుగడకు మాతృభాష అత్యంత అవసరమని తెలిపారు. అంతరించిపోతున్న అనేక జాతుల మనుగడకు మాతృభాష పరిరక్షణ ఎంతో ముఖ్యమని వివరించారు. మాతృభాషలోనే ప్రాథమిక విద్య జరగేటట్లు ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల కోసం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన “భువనవిజయం” కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం విద్యార్థులను మాత్రమే కాకుండా గ్రామస్తులను కూడా ఎంతో ఆకట్టుకుంది. విద్యార్థులు చారిత్రక పాత్రలను ధరించి అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు. మొత్తం కార్యక్రమం ఎంతో విజయవంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# యాదవ్ ,బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలి

ప్రజా భూమి ప్రతినిధి :రేణిగుంట

ఈ నెల 22వ తేదీన గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా పూలే--అంబేద్కర్ మండల్, కర్పూరి ఠాగూర్ ప్రాంగణంలో లక్షలాది మందితో నిర్వహించనున్న బీసీ సింహ






గర్జనను విజయవంతం చేయాలని, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి వెంకటాద్రి యాదవ్ పిలుపునిచ్చారు. రేణిగుంట ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశంలో భారత చైతన్య యువజన పార్టీ నాయకులు, బీసీ నాయకులు పాల్గొని మీడియాతో మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్యం అనంతరం దాదాపు 80 ఏళ్లు గడిచినా బీసీలకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్రం లభించలేదని ఆయన విమర్శించారు. బీసీల రక్షణచట్టాన్ని తక్షణమే అమలు చేయాలని, బీసీ కార్పొరేషన్లకు సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్లలో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించడంతో పాటు, జనాభాదామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఏపీలో కులగణన నిర్వహించాలన్న డిమాండ్‌తో పాటు,పూలే దంపతులకు భారతరత్న అవార్డు ప్రకటించాలని ప్రకటించాలని అన్నారు. ఈ బీసీ సింహగర్జన వేదికగా గట్టిగా వినిపించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ఈ భారీబహిరంగసభను విజయవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా బీసీలు లక్షలాదిగా తరలిరావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి యాదవ్, హిమ బిందు, విక్రమ్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ ను కలసిన నాయుడుపేట బిజెపి నేతలు

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట టౌన్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ను నాయుడుపేట పట్టణానికి చెందిన బిజెపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడలోని బిజెపి కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ను బిజెపి ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి బొల్లాకాయల



విజయభాస్కర్, బిజెపి జిల్లా మాజీ కార్యదర్శులు ఆశా చెంచు కృష్ణయ్య,అమరావతి రామయ్య,సర్వాడి చంద్రశేఖర్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వారితో చర్చించారు. నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

# శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మరో ముఖ్యమైన రాజకీయ-ఆధ్యాత్మిక సందర్భం చోటుచేసుకుంది

- కింజరపు రామ్మోహన్ నాయుడు స్వామివారి దర్శనార్థం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం కు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
- దర్శనానంతరం ఆయన, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వగృహానికి చేరుకుని ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కేంద్ర మంత్రికి సాదర స్వాగతం పలికారు.





ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

స్వర్గీయ నేత స్మరణ -- అభివృద్ధి దిశగా నిబద్ధత ఈ సందర్భంగా స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి శ్రీకాళహస్తి అభివృద్ధికి చేసిన విశేష కృషిని కేంద్ర మంత్రి ప్రత్యేకంగా స్మరించుకున్నారు. అలాగే “కింజరాపు ఎర్రన్నాయుడు” కి బొజ్జల గోపాలకృష్ణ తో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆ కుటుంబాల మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావించారు. “తండ్రికి తగ్గ తనయుడిగా శ్రీకాళహస్తి అభివృద్ధిని పదునుగా ముందుకు నడిపిస్తున్నారు” అంటూ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ని రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు. అన్న అంటూ ఆప్యాయంగా సంబోధిస్తూ తన సోదరభావాన్ని వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి – దేశవ్యాప్తంగా గుర్తింపు దిశగా శ్రీకాళహస్తి ప్రధాన ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే “గుడిమల్లం” ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ప్రత్యేకంగా శ్రీకాళహస్తి, గుడిమల్లం ఆలయాల ప్రాధాన్యతను దేశవ్యాప్తంగా తెలియజేయాలనే ఉద్దేశంతో ఒక సమగ్ర గ్రంథాన్ని సిద్ధం చేసి కేంద్ర మంత్రులకు అందజేసిన విధానాన్ని వివరించారు. ఆలయాల శోభను, పరిపాలనా పారదర్శకతను, భక్తుల సౌకర్యాల పెంపును మెచ్చుకున్న రామ్మోహన్ నాయుడు , “నా తరపున గానీ, కేంద్ర ప్రభుత్వ తరపున గానీ అవసరమైన సహాయం అందించేందుకు నేను మీతో ఉన్నాను” అని హామీ ఇచ్చారు. **ప్రాంతీయ అభివృద్ధిపై చర్చ** : సమావేశంలో అభివృద్ధి అంశాలపై కూడా చర్చ జరిగింది. ముఖ్యంగా రేణిగుంట విమానాశ్రయం నుండి పలు ప్రాంతాలకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. అలాగే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా జూ= నిధులను ప్రాంతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలనే విజ్ఞప్తిని చేశారు. ఈ మొత్తం సందర్భంలో, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రశంసలు ప్రత్యేకంగా నిలిచాయి. లిశ్రీకాళహస్తి ఆధ్యాత్మిక క్షేత్రంగా మాత్రమే కాకుండా, సమగ్ర అభివృద్ధి కేంద్రంగా ఎదగాలన్న సంకల్పానికి ఈ భేటీ మరింత బలం చేకూర్చినట్లైంది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ట్రస్ట్ బోర్డు చైర్మన్ సభ్యులు అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి పౌరులు చట్టాలపై అవగాహనతో బాధ్యతగా నడుచుకోవాలి

## “ర్యాగింగ్ వద్దు యాంటీ ర్యాగింగ్ ముద్దు” - ఇన్స్పెక్టర్ డి .గోపి







ప్రజాభూమిప్రతినిధి, చిత్తూరు

దేశానికి రేపటి పౌరులైన నేటి విద్యార్థులను చట్టాలపై అవగాహన కలిగిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చిత్తూరు జిల్లా పోలీసులు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో ఈ అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం పూతలపట్టు మండలంలోని ఎస్.వి. ఇంజనీరింగ్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఇన్స్పెక్టర్ డి. గోపి హాజరై విద్యార్థినీ, విద్యార్థులకు “యాంటీ ర్యాగింగ్, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, ఓపెన్ బుజింగ్, గాంజా, ధైర్యా-స్పర్శ” పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది విద్యార్థులు మరియు కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ డి. గోపి మాట్లాడుతూ, కళాశాలల్లో ర్యాగింగ్‌కు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. ర్యాగింగ్ అనేది సరదా కోసం చేసే పని కాదని, అది బాధితుల మానసిక స్థితిని తీవ్రంగా దెబ్బతీసి వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని తెలిపారు. “ర్యాగింగ్ వద్దు... యాంటీ ర్యాగింగ్ ముద్దు” అనే నినాదాన్ని ప్రతి విద్యార్థి తన జీవన సూత్రంగా తీసుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే పోలీసు కేసులు నమోదు చేయడంతో పాటు కళాశాల స్థాయిలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లు ఏర్పాటు చేసి పూర్తిగా అరికడతామని తెలిపారు. అలాగే మహిళలపై నేరాల అంశంపై మాట్లాడుతూ, మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలపై జరిగే వేధింపులు, సోషల్ మీడియా ద్వారా చేసే దూషణలు చట్టరీత్యా నేరాలని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని విద్యార్థులకు వివరించారు.

మహిళల భద్రత కోసం ప్రభుత్వం మరియు పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు, సహాయక సేవల గురించి కూడా అవగాహన కల్పించారు. ఓపెన్ బుజింగ్, మద్యం సేవించడం మరియు గాంజా వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితాలు ఎలా దారి తప్పుతున్నాయో ఉదాహరణలతో వివరించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా చదువులపై, కుటుంబ జీవితం పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. గాంజా కలిగి ఉండటం లేదా వినియోగించడం చట్టవిరుద్ధమని, దీనికి కఠిన శిక్షలు ఉన్నాయని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ప్రారంభించిన ప్రతిష్టాత్మక “ధైర్య స్పర్శ” కార్యక్రమం ఉద్దేశ్యం - ప్రజల్లో భయాన్ని కలిగించే ప్రాంతాలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకునే ప్రదేశాలను గుర్తించి, వాటిని ప్రజలు ధైర్యంగా సంచరించే సురక్షిత ప్రాంతాలుగా మార్పు చేయడమేనని తెలిపారు. మీ పరిసరాల్లో ఇలాంటి ప్రదేశాలు ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అందిన సమాచారం ఆధారంగా ఆయా ప్రాంతాలను “ధైర్య స్పర్శ -- భయానికి ముగింపు, భద్రతకు ఆరంభం” భావనతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా పోలీసులు భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ యువతను సరైన దిశలో నడిపించేందుకు కృషి చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు.

# పెట్టుబడిదారీ విధానంలో దోపిడి అనివార్యం

## సోషలిజమే దేశానికి దిక్కు




ప్రజాభూమి ప్రతినిధి (సత్యవేడు) కేవీబీపురం

రెడ్ బుక్ డే ను పురస్కరించుకొని సత్యవేడు మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో కార్యదర్శి మెలుగు రమేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడుదారి సమాజంలో ఆర్థిక సంక్షోభాల నేపద్యంలో కమ్యూనిస్టు పితామహుడు లెనిన్ రాసిన సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి విధానపు అత్యున్నత దశ అనే పుస్తకం పై మాట్లాడారు. నేడు భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు, మరియు సహజ వనరులు అడవులు బొగ్గు నీరు ఖనిజాలు లాంటి వనరులపై కార్పొరేట్ కంపెనీల పెత్తనాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల దేశంలో మరింత దరిద్రం ,ఆకలి కేకలు, నిరుద్యోగం, కుల, మతాల ఘర్షణలో ప్రజలు మరింత సంక్షోభంలోకి నెట్టబడతారని తెలిపారు. ఈ పెట్టుబడిదారీ సమాజంలో సంపదంత కొందరి చేత కేంద్రీకరించబడి సమాజంలో తీవ్రమైన అసమానతలు ఏర్పడి సంక్షోభాలకు కారణమవుతుందని తెలిపారు. కమ్యూనిస్టు శ్రేణులు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను పరిశీలించి ప్రజలను పోరాటాల వైపు సమీకరించాలని పిలుపునిచ్చారు. బూర్జువా రాజకీయ పార్టీలు ప్రజలను విడగొట్టి పబ్బం గడుపుకుంటూ ప్రజల సంపదను కార్పొరేట్ల పరం చేస్తూ సంక్షేమ పథకాలు పేరుతో దేశంలో విపరీతమైన అప్పుల సుడిగుండంలో నెట్టబడి ఆర్థిక సంక్షోభాలకు కారణమవుతుందని తెలిపారు. 110 సంవత్సరాల పూర్వమే భవిష్యత్తును దూర దృష్టితో గుర్తించిన మహా నేత అని నెల్లిన్ను కొనియాడారు. దేశంలో అట్టడుగు ప్రజలు, అణ గారిన ప్రజలు కార్మికులు రైతులు ప్రయోజనాల కొరకు కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పనిచేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో అసమానతలకు వ్యతిరేకంగా కార్మిక చట్టాల వలన నష్టపోయే కార్మికులను ఐక్యం చేసి రైతాంగ సమస్యల పైన రైతులను, కూలీల సమస్యల పైన వ్యవసాయ కూలీలను సమీకరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి రమేష్ సిపిఎం నాయకులు మురళి కృష్ణయ్య మునస్వామి భాస్కర్ సుశీల ఎల్లయ్య మారి నాగవల్లి పోలమ్మ నదియా మారి ముత్తు సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# చెత్త రహిత తిరుపతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : కమిషనర్ ఎన్.మౌర్య..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:(తిరుపతి)




చెత్త రహిత, సుందర తిరుపతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో భాగంగా శనివారం నగరంలోని దండి మార్చ్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీటిడి బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళల కార్పొరేషన్ చెర్మన్ హరి ప్రసాద్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ దూది కుమారి, అర్బన్ డెవలప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ వూకా విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, నాయీ బ్రాహ్మణ సంఘం చైర్మన్ రుద్రకోటి సదాశివం లు పాల్గొని వ్యర్థాల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, దుకాణ దళారులకు తడి,పొడి చెత్త వేరు చేసేందుకు




బుట్టలను అందజేశారు. అందరిచే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తోందని తెలిపారు. అందులో భాగంగా ప్రతినెల ఒక అంశంపై ప్రజలకు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. తమ ఇంటితో పాటు, పరిసరాలు, కార్యాలయాల్లో వ్యర్థాలు లేకుండా శుభ్రం చేసి, వ్యర్థ రహిత, సుందర తిరుపతి సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఫోర్ బిన్ సిస్టం ద్వారా తడి, పొడి, ప్రమాదకర వ్యర్తాలు, ఈ వేస్ట్ అనే నాలుగు రకాలుగా చెత్త ను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను హోమ్ కంపోస్ట్ చేసి మొక్కలకు ఎరువుగా వినియోగించుకోవాలని తెలిపారు. హోమ్ కంపోస్ట్ తయారీ విధానం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి. ఈ. లు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# నాయుడుపేట లో రేపు విద్యుత్ అంతరాయం -ఎఇ శివశంకర్

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట టౌన్

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం లో నాయుడు పేట పట్టణంలో 22 - 02 -26 తేదీ ఆదివారం నాడు నాయుడుపేట టౌన్ 33/11కేవీ సబ్‌స్టేషన్ నుండి వెళ్లే 11 కెవి సప్తగిరి ఫీడర్ కండక్టర్ వైరు డ్యామేజ్ కారణంగా నూతన కండక్టర్ వైర్ మార్చుటకు అత్యవసర మరమ్మత్తుల కొరకు ఉదయం 09 :00 గంటల నుండి 2:00 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుంది.. నాయుడుపేట పట్టణం లోని బి ఎం ఆర్ నగర్,బాలాజీ గ్రీన్ సిటి,బోపయ్య కాలనీ, కోళ్ల ఫారం, ఆవని హోమ్స్ ,కాళహస్తి బైపాస్ రోడ్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడును విద్యుత్ శాఖ అధికారులు తెలియజేశారు



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
ఆదివారం 22 ఫిబ్రవరి 2025

# చంద్రగిరిలో ప్రకృతిపై ఎమ్మెల్యే నాని విధ్వంసం

- చంద్రగిరి చరిత్రలో ఇలాంటి అవినీతి ఎమ్మెల్యేని చూడలేదు
- 25 ప్రదేశాల్లో యథేచ్ఛగా ఇసుక, మట్టి తవ్వకాలు
- వారం రోజులు గడువిస్తున్నా.. అన్నీ ఆపేయండి..
- ఆ తరువాత ఎక్కడికక్కడ తవ్వకాలు అడ్డుకుంటాం
- మీడియా సమావేశంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హెచ్చరిక





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి, రూరల్

చంద్రగిరి నియోజకవర్గంలో ప్రకృతి వనరులను సర్వనాశనం చేస్తున్న పులివర్తి నాని అవినీతి, అక్రమాలపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తిరుపతి ప్రెస్‌క్లబ్ వేదికగా చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శుక్రవారం ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని అక్రమ సంపాదనకు కొండలు, గుట్టలు, చెరువులు, వాగులు, వంకలు, నదులన్నీ ఆనవాళ్లు కోల్పోతున్నాయన్నారు. కోట్ల రూపాయల మట్టి, ఇసుకను తవ్వేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఏ నాయకుడైనా తన వద్దకు ఎవ్వరైనా వచ్చి ఉపాది కావాలంటే తన చేతనైన సాయం చేయడమో, ఉద్యోగం తీసివ్వడమో చేస్తారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దగ్గరకు వెళ్లి తనకు ఉపాధి కావాలంటే ఒక టిప్పర్ కొనుక్కో బ్రతుకుదెరువు నేను చూపిస్తాను అంటూ ప్రకృతి వనరులను దోచేసే బాధ్యతను అప్పగిస్తున్నారంటే ఆయన నైజం ఏలాంటిదో అందరూ అర్థం చేసుకోవాలన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే చంద్రగిరి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసిన నారా రామ్మూర్తి నాయుడు, గల్లా అరుణకుమారి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు ఎవ్వరు కూడా ఇలాంటి పనులు చేయలేదని, పులివర్తి నాని ధన దాహానికి ప్రకృతి విలవిలలాడుతోందని ఘాటుగా విమర్శించారు.

**25 ప్రదేశాల్లో ఇసుక, మట్టి తవ్వకాలు :** చంద్రగిరి నియోజకవర్గంలోని చంద్రగిరి, రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలాల పరిధిలో 25 ప్రదేశాలను ఎంపిక చేసుకుని అక్కడ నుంచే మట్టి, ఇసుక అక్రమ రవాణాను యధేచ్ఛగా సాగిస్తున్నట్టు తెలిపారు. అధికారులకు అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తి చూడటం లేదని, ప్రకృతిపై పగబట్టిన వారు ఎవ్వరైనా సరే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. అక్రమ సంపాదన కోసం చెరువులు, గుట్టలు, కొండలను సర్వనాశనం చేస్తున్న వారిపై ప్రజలందరితో కలసి పోరాటం చేస్తానని, భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపదను కాపాడే బాధ్యత తనపై ఉందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడించారు.

## స్వచ్ఛంద్ర - స్వర్ణాంధ్ర సాధనే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం

### పిచ్చాటూరు లో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాభూమి ప్రతినిధి కేవీబీపురం

స్వచ్ఛంద్ర - స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం గా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. శనివారం పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తాము వినియోగించి పారివేస్తున్న ప్లాస్టిక్, గాజు సీసా వస్తువులను సేకరించి తమ గ్రామానికి వచ్చే ఈ స్వచ్ఛ రథం కు అందిస్తే వాటికి సరిపడ నిత్యావసర వస్తువులను ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ స్వచ్ఛ రథం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం అధికారులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం స్వచ్ఛంద్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. చివరగా స్వచ్ఛంద్ర - స్వర్ణాంధ్ర రథాన్ని పచ్చ జెండా ఊపి ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కొత్తగాఎన్టీఆర్ భరోసా పింఛన్లు కొరకు దరఖాస్తు చేయుటకు కావాల్సిన డాకుమెంట్స్ ..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కొత్తగాఎన్ టిఆర్ భరోసా పింఛన్ పథకం కొరకు కావలసిన సర్టిఫికెట్ వివరాలు ఇలా ఉన్నాయి. ఆదాయం. సర్టిఫికెట్ మరియు క్యాస్ట్ సర్టిఫికెట్ లు లేటెస్ట్ గా ఈ క్రొత్త సంవత్సరం లో (2026) తీసుకుని రావాలి.గతంలో ఈ క్యాస్ట్ సర్టిఫికెట్ మరియు ఆదాయం సర్టిఫికెట్ లు తీసుకుని ఉంటే మీసేవ సెంటర్ కి వెళ్లి కొత్తగా పెన్షన్ కొరకు దరఖాస్తు చేయుటకు కావాల్సిన డాకుమెంట్స్ :ఆదాయం సర్టిఫికెట్ మరియు క్యాస్ట్ సర్టిఫికెట్ లు లేటెస్ట్ గా ఈ క్రొత్త సంవత్సరం లో (2026) తీసుకుని రావాలి. గతంలో ఈ క్యాస్ట్ సర్టిఫికెట్ మరియు ఆదాయం సర్టిఫికెట్ లు తీసుకుని ఉంటే మీసేవ సెంటర్ కి వెళ్లి రెన్యువల్ చేయించుకోని ఆ సర్టిఫికెట్ లు ను తీసుకుని రావాలి

1) ఆధార్ జిరాక్స్ కాపీ.
2) ఆధార్ హిస్టరీ.
3)రేషన్ కార్డు.
4)ఆదాయం సర్టిఫికెట్.
5)క్యాస్ట్ సర్టిఫికెట్.

నోట్ :ఆధార్ నెంబర్ కి మొబైల్ లింక్ అయ్యి ఉండాలి.

వితంతు పెన్షన్ దరఖాస్తు చేయుటకు..

==================

1) ఆధార్ జిరాక్స్ కాపీ.
2) ఆధార్ హిస్టరీ.
3)రేషన్ కార్డు.
4)ఆదాయం సర్టిఫికెట్.
5)క్యాస్ట్ సర్టిఫికెట్.
6)భర్త డెత్ సర్టిఫికెట్.

ఒంటరి మహిళా పెన్షన్ కి దరఖాస్తు చేయుటకు

=================

1) ఆధార్ జిరాక్స్ కాపీ
2) ఆధార్ హిస్టరీ
3)రేషన్ కార్డు
4)ఆదాయం సర్టిఫికెట్
5)క్యాస్ట్ సర్టిఫికెట్
6)గవర్నమెంట్ అనగా కోర్ట్ ద్వారా నిర్ధారించబడిన విడాకుల సర్టిఫికెట్.

వృధాప్య పెన్షన్ కొరకు:

==============

1) ఆధార్ జిరాక్స్ కాపీ
2) ఆధార్ హిస్టరీ
3)రేషన్ కార్డు
4)ఆదాయం సర్టిఫికెట్
5)క్యాస్ట్ సర్టిఫికెట్
6)వయస్సు 60 సంవత్సరాలు పైన ఉండాలి.

వికలాంగుల పెన్షన్..

1) ఆధార్ జిరాక్స్ కాపీ
2) ఆధార్ హిస్టరీ
3)రేషన్ కార్డు
4)ఆదాయం సర్టిఫికెట్
5)క్యాస్ట్ సర్టిఫికెట్
6)గవర్నమెంట్ డాక్టర్స్ చే నిర్ధారించిన సదరం సర్టిఫికెట్(వికలాంగులు అని నిర్ధారించే సర్టిఫికెట్ )తీసుకొని సచివాలయంకి వెళ్ళి జిరాక్స్ లు సవర్పించి క్రొత్త ఫించన్ లకు ఆన్లైన్ చేయింకోగలరు.

## ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల...."స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర" కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి





స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతి ప్రభుత్వప్రసూతి వైద్యశాల నందు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, విజయవాడ వారి ఆదేశాలు మేరకు, సూపరింటెండెంట్ డా ప్రమీలదేవీ మరియు సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో హాస్పిటల్ లోని నర్సింగ్ స్టాఫ్, స్టూడెంట్స్, శానిటేషన్ సిబ్బందికి మరియు గర్భవతుల కు, కుటుంబ సభ్యులకు కు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మరియు స్వచ్ఛ భారత్ కార్యక్రమము యొక్క ముఖ్యఉద్దేశ్యం గురించి, ప్రజలశీ దరు మరుగుదొడ్లు నే వాడాలని, పరిసరాల పరిశుభ్రత తో పాటు, వ్యక్తి గత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, ప్రజలందరూ పరిశుభ్రత గురించి తెలుసుకొని, పర్యావరణ పరిశుభ్రత కొరకు వారి వంతు కృషి చేసి ఆరోగ్యవంతమైన సమాజం కొరకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు కొంత సమయంకేటాయించి, ఆరోగ్యాన్ని పెంపొందించు కోవాలని తెలియ చేశారు. అలాగే "స్వచ్ఛత "పై అవగాహన కల్పించే దిశగా ప్రతి ఒక్కరూ ప్రయత్నశీ చేసి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యావంతమైన, సుభిక్షమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నిర్మించడానికి, "స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణ ఆంధ్ర "గా తీర్చి దిద్దడానికి మన వంతుగా అందరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయుంచారూ.ఈ కార్యక్రమంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ డా ప్రసన్న ఠాగూర్, డా శ్రీనివాసులు, డా శ్రీకర్ , లెక్చరర్ డా నిర్మలమ్మ, ఇంచార్జి నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి రాణి, హెడ్ నర్సస్ శ్రీమతి శాంత,శివమ్మ, స్టాఫ్ నర్సస్ శ్రీమతి లక్ష్మి, పుష్ప, లత, సరస్వతి, ఈశ్వరి సృజన,హరిత, కన్యాకుమారి మరియు రఘు నాథ్ సెక్యూరిటీ సూపర్వైజర్, శానిటేషన్ సూపెర్వైజర్, శానిటేషన్ వర్కర్స్, ప్రజలు అందరూ పాల్గొన్నారు



## ఏపీడబ్ల్యూజేఎఫ్ శ్రీకాళహస్తి కమిటీ







ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ శ్రీకాళహస్తి నియోజకవర్గ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వళిగలం గోపి, జిల్లా కన్వీనర్ తులసీ రామ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కావేరిపాకం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా పెరిమిడి రఘు, ఉపాధ్యక్షులుగా బాలు(బాబు), మునిచంద్ర, కోశాధికారిగా చక్రపాణి, సహాయ కార్యదర్శిగా బాలచంద్ర ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు, హక్కుల సాధనకై పెడరేషన్ పోరాడుతుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. జర్నలిస్టు సమస్యల పోరాటానికై మార్చి 4న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణు గోపాల్, సీనియర్ పాత్రికేయులు బాలచంద్ర(వీ2), కామేష్, హరిబాబు, ధనశేఖర్, హకీం తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి నియోజకవర్గంలో జరిగే మట్టి దోపిడీపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు..!

- ఆధారాలు చూపిన ఎంపీపీ, వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షులు
- విచారణ చేసి తప్పకుండా చర్యలు తీసుకుంటామన్న జిల్లా కలెక్టర్
- ఒక వారం రోజుల్లో తవ్వకాలు ఆపకుంటే ప్రత్యక్ష పోరాటం
- స్థానిక ప్రజలతో కలసి అన్ని చోట్లా ఆందోళనలు ఉధృతం చేస్తాం





ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని అండతో జరిగే మట్టి దోపిడీపై తిరుపతి రూరల్ ఎంపీపీ విడుదల మాదవరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షులు మునీశ్వర రెడ్డిలు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు శనివారం ఫిర్యాదు చేశారు. చంద్రగిరి నియోజక వర్గం వ్యాప్తంగా 25 కేంద్రాలను మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డాగా చేసుకున్నారని, అక్కడ జరిగే అక్రమ తవ్వకాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కలెక్టర్‌కు చూపారు. దళవాయి చెరువు సమీపంలోనే వుందని తమరు ప్రత్యక్షంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఒక వారం రోజుల్లో అక్రమ తవ్వకాలు ఆపకుంటే తమ నాయకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రకటించడం జరిగిందని, మట్టి, ఇసుక అక్రమంగా తవ్వుతున్న ప్రాంతాల్లో స్థానిక ప్రజలను కలుపుకుని ఆందోళలను ఉధృతం చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. ఆ మేరకు స్పందించిన ఆయన సమగ్ర విచారణ జరిపి అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 23 నుండి 26వ తేదీ వరకు బూరగమంద శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బాలాలయం..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చిత్తూరు జిల్లా సదుం మండలం బూరగమంద గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 23 నుండి 26వ తేదీ వరకు ''బాలాలయం'' కార్యక్రమం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఇందుకోసం ఫిబ్రవరి 23న ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్ వరణం, సాయంత్రం అంకురార్పణ, శాంతి హోమం, కళాకర్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.సాధారణంగా గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం ''బాలాలయం'' చేపడతారు. ఇందుకోసం ఆలయంలో నమూనా ఆలయం ఏర్పాటుచేసి గర్భాలయంలోని మూలవర్ల చిత్రపటాలను ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 24న ఉదయం అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, సాయంత్రం మహా శాంతి హోమాలు, వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఫిబ్రవరి 25న ఉదయం బాలాలయ స్థాపనారాధన, చతుర్ధశ కళశారాధన, పంచగవ్యాధివాసం, సాయంత్రం మహాశాంతి అభిషేకం, వైదిక కార్యక్రమాలు చేపడతారు. ఫిబ్రవరి 26న ఉదయం 7.30 గంటలకు యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షణ, బాలాలయ సంప్రోక్షణం, ధ్రువ కల్యాణం చేపడతారు.



## నాయుడుపేటలో ఈ వేస్ట్ సేకరణ మీద అవగాహనా : మున్సిపల్ కమిషనర్ ఫజులుల్ల




ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట టౌన్

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచంద్ర (రాూరూా) కార్యక్రమంలో భాగంగా ఈ వెస్ట్ సేకరణ చేపట్టారు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పడి ఇంటింటికి తిరిగి కిలోలలో ఈ వేస్ట్ సేకరించడం జరిగింది. దీనిని పంపించారు వార్డు సచివాలయ సిబ్బంది మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛతర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఏవేశ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది ఇతర నగరాలలో ప్రత్యేక ప్రవీణ్ నిర్వహించి పాడేరు ఎలెక్ట్రానిక్స్ ప్లాస్టిక్లను సేకరిస్తున్నారు మున్సిపల్ కార్యాలయాల్లో రెగ్యులర్ డ్రైవ్ లను ప్రతినెల 10 20వ తేదీలలో జరుగుతున్నాయి ఇటీవల ఒక డ్రైవ్ లో కూడా 250 కేజీల వరకు సేకరించడం జరిగింది. దీని మీద ఈ వేస్ట్ సేకరణ యాప్ కూడా లాంచ్ చేయడం జరిగింది. ఇందులో రిజిస్టర్ అవ్వాలంటే మొదటగా యాప్ డౌన్లోడ్ చేసి రిజిస్టర్ మీ మొబైల్ నెంబర్ చిరునామా వివరాలు ఇవ్వాలి. తదుపరి పాడిన పరికరాలు వివరాలు నమోదు చేయాలి ఫోన్ లాప్టాప్ చార్జర్ వంటి వస్తువులు ఆ పరిమాణం కండిషన్ ఎంటర్ చేయాలి. స్లాగ్ బుక్ చేయడం అందుబాటులో ఉన్న తేదీ సమయం ఉంచుకోండి సిబ్బంది ఇంటికి వచ్చి సేకరిస్తారు

**ప్రయోజనాలు :** యాప్ ద్వారా వస్తువుల విలువ మేకింగ్ ఆధారంగా క్యాష్ బ్యాక్ లేదా డిస్కౌంట్ ఇస్తారు ఉదాహరణకు పాడైన ఫోన్ ఇస్తే డబ్బు తిరిగి వస్తుంది ట్రాకింగ్ ఫ్యూచర్ తో సేకరణ స్థితిని చెక్ చేయవచ్చు రీసైక్లింగ్ సర్టిఫికెట్ కూడా అందిస్తారు ఇది పర్యావరణహితంగా సౌకర్యవంతంగా పనిచేస్తుందని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ పజిలుల్ల మరియు పురపాలక మేనేజర్ ఉరుకుందమ్మ వీటి యొక్క ఉపయోగాలు గురించి వివరించారు

## స్వచ్ఛ రథం ప్రారంభించిన తెలుగుదేశం నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రాపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులతో కలిసి స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. గ్రామాలలో పాత వస్తువులు ఇస్తే నిత్యవసర వస్తువులు అందిస్తారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి మండల అధికారులతో కలిసి స్వచ్ఛ రథాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పాత వస్తువులు ఇస్తే నిత్యవసర వస్తువులు ఇస్తే నిత్యావసర వస్తువులు అందిస్తారన్నారు. ఈ స్వచ్ఛ రథం ప్రతి గ్రామంలో ప్రతి వీధికి వస్తుంది అన్నారు. ఇంటిలో పాడైన వస్తువులు ఎక్కడ పార వేయకుండా ఈ స్వచ రథానికి ఇస్తే వారికి కావలసిన వస్తువులు తీసుకోవచ్చు అన్నారు. పాత వస్తువులు ధరలు పట్టిక కూడా వాహనంపై అంటించడం జరిగిందన్నారు. ప్రజలందరూ ఈ యొక్క అవకాశాన్ని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మండల అధికారులు పాల్గొన్నారు.





## కమ్యూనిజమే మార్పుకు నాంది




ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

ప్రపంచ మానవ చరిత్రలో కారల్ మార్క్స్, ఏంగిల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక సమాజ పెను మార్పుకు నాంది పలికిందని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలత అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శనివారం 'రాజ్యం–విప్లవం' పేరిట రెడ్ బుక్ డే సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సాయిలత హాజరై ప్రసంగించారు. మానవ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రని అందరూ వివరించారనీ, కానీ కమ్యూనిస్టు ప్రణాళిక మాత్రం ఈ ప్రపంచాన్ని మార్చాలని ఉద్భోదించిందన్నారు. దీని ప్రేరణతో మనిషిని మనిషి దోపిడీ చేసే విధానానికి ప్రత్యామ్నాయంగా అందరూ సమానమేనన్న సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. ఈ సందర్భంగా ఆటవిక, బానిస, భూస్వామ్య, పెట్టుబడి దారీ సమాజం, సామ్రాజ్యవాద నియంతృత్వం వంటి అంశాలను అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. కమ్యూనిస్టు ప్రణాళిక ఇచ్చినటువంటి స్ఫూర్తితో ప్రతి కార్యకర్త దోపిడీకి తావులేని సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, గురునాధం, ఈశ్వరయ్య, రాధమ్మ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## కే వి బి పురం మండలంలో ఘనంగా నూక తోటి జన్మదిన వేడుకలు...!!



ప్రజాభూమి ప్రతినిధి కేవీబీపురం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్యవేడు నియోజకవర్గం సమన్వయకర్త నూక తోటి రాజేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కన్వీనర్ గవర్ల కృష్ణయ్య నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఆవరణలో నూక తోటి రాజేష్ డిజిటల్ బ్యానర్ ఏర్పాటు చేసి అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నూక తోటి జన్మదినం సందర్భంగా కన్వీనర్ కృష్ణయ్య మాట్లాడుతూ పార్టీ నేతలకు కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం నడిపిస్తూ అందరి మన్ననలు పొందుకుంటున్న నూక తోటి రాజేష్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. 2024 ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి అయినప్పటికీ చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. 2029 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలవడం ఖాయమని తెలిపారు. ఎంపీపీ రాయదుర్గం ముని లక్ష్మి నందకుమార్ లాల్ బాగ్ యాదవ్ రామ్మోహన్ వర్మ గిరిబాబు ఢిల్లీ నరేష్ రాదయ్య మహేష్ పూడి మనీ సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభయాన్ 2026 కార్యక్రమం

### -ప్రశిక్షణ జిల్లా స్థాయి కార్యశాల

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం



పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ 2026 భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రశిక్షణ కార్యక్రమాన్ని చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండలం సి. రామాపురం గ్రామంలోని ప్రైవేట్ మినీ హాల్లోఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరు జోన్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కార్యకర్త అంటే నిస్వార్థంగా దేశ సేవ కోసమే జీవిస్తాడని సమాజ హితమే అతని ప్రథమ కర్తవ్యం అన్నారు. జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేసి చూపించింది అని ప్రతి బిజెపి కార్యకర్త బడుగు బలహీన వర్గాల వారి అభివృద్ధి కోసం పని చేయాలని పిలుపునిచ్చారు . మార్చి 7 నుండి ఏప్రిల్ 14 అన్ని మండలాల్లో కూడా ప్రశిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు., రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాగోతు మాట్లాడుతూ దేశము మరియు సమాజం హితం కోసం మనం ఆచరించాల్సిన పంచ పరివర్తనల గురించి కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యులు మునిసుబ్రమణ్యం, మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ప్రశిక్షణ కమిటీ సభ్యులు బీడీ బాలాజీ, ఎద్దల నరేంద్ర రెడ్డి, వరప్రసాద్, తేజోవతి, డాక్టర్ నరేష్ బాబు, జిల్లా కార్యదర్శి హరినాథ్ రెడ్డి మరియు జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## ఉంజల్ సేవలో కళ్యాణ వెంకన్న



ప్రజాభూమి ప్రతినిధి నారాయణ వనం మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన ప్రముఖ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం టిటిడి ఆలయమైన శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి ఘనంగా ఉంజల సేవ నిర్వహించారు. ఉదయం6 గంటలకు సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పి, నిత్య పూజా కార్యక్రమాల అనంతరం10 గంటలకు స్వామి అమ్మవార్లకు పాలు పెరుగు నెయ్యి కొబ్బరి నీళ్లు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తర్వాత వివిధ పుష్పాలతో సు మనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో సు మనోహరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిరోహించిఆలయ ప్రాంగణంలో ఊరేగించి ఉంజల సేవ వేడుకగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, అర్జిత్ ఇన్స్పెక్టర్ భరత్, ఆలయ అర్చకులుశ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది, వాహన మోతగాళ్లు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం చైర్మన్‌ను వివాహానికి ఆహ్వానించిన జిజేయం ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెటింట్ - మీడియా హెడ్ చందు సిమిరాల

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్



జిజేయం ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెటింగ్ ఒ మీడియా హెడ్ శ్రీ చందు సిమిరాల శనివారం శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన వివాహ మహోత్సవానికి విచ్చేయవలసిందిగా కోరుతూ చైర్మన్ కి పెళ్ళి పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ చందు సిమిరాలని శాలువాతో ఘనంగా సత్కరించి మహిమగల శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి చిత్ర పటాన్ని అందజేసి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు చందు సిమిరాల శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని ప్రత్యేకంగా దర్శించుకుని, వేద పండితుల ఆశీర్వచనాలను పొందారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గ్లోబల్ కేర్ ఫార్మా ప్రొప్రైటర్ నార్జాల నరేన్ రాయల్, ఎస్ క్యాబ్స్ ప్రొప్రైటర్ వి. శివతేజ, రాజ్యలక్ష్మి మిల్స్ అండ్ డిగాగిగేటర్స్ ప్రొప్రైటర్ కంటా మునిరత్నం, శ్రీకాళహస్తీశ్వర కో - ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కొట్టే అనిల్ రాయల్, పాకాల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

## సడ్లపల్లి లో విగ్రహ ప్రతిష్టాపన పూజలు ప్రారంభం

### -విరాళాన్ని అందజేసిన కొండూరు వేణుగోపాల్ రెడ్డి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ఎస్.సడ్లపల్లి లో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఆంజనేయస్వామి, మహాగణపతి, ఆదిత్యాది నవగ్రహ పునః ప్రతిష్ఠపన, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వైకాపా నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, హిమాని కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం వేణుగోపాల్ రెడ్డి దేవాలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారంగా రూ.1,11,111/- ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు కొండూరు వేణుగోపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త పుల్లారెడ్డి, ఫుడ్ మార్ట్ మంజునాథరెడ్డి, కమిటీ సభ్యులు శివారెడ్డి, సిమెంట్ వెంకటేష్ రెడ్డి, ప్రమోద్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ సునీత వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు గోపాల్, నారాయణప్ప, లింగారెడ్డి, వైసిపి నాయకులు బాబు రెడ్డి, తిమ్మా రెడ్డి, బసవనపల్లి నారాయణ రెడ్డి, సడ్లపల్లి బుస్సా శ్రీనివాస్ రెడ్డి, కుప్పారెడ్డి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ రేడియేషన్ ఆంకాలజి విభాగం వారి ఆధ్వర్యంలో 8వ వార్షిక ఛైర్ ఓరియేషన్



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:(తిరుపతి)




శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) రేడియేషన్ ఆంకాలజి విభాగం వారి ఆధ్వర్యంలో రేడియోధార్మికతను అధిగమించడం – హైపర్థెర్మియా పాత్ర అనే అంశంపై 8వ వార్షిక ఛైర్ ఒరేషన్ కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా॥ రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఛైర్ ఓరేటర్‌గా విచ్చేసిన డా॥ బాలబాయ్ నానావతి హాస్పిటల్, ముంబాయి నుండి ఛైర్ ఓరేటర్‌గా చీఫ్ రేడియేషన్ ఆంకాలజిస్టు డా॥ నాగరాజ్ డా॥ నాగరాజ్ గురురాజ్ హులిగల్ మరియు ముఖ్య అతిథిగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా॥ రామ్, రేడియేషన్ ఆంకాలజి విభాగాధిపతి డా॥ బి.వి.సుబ్రమణియన్, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా॥ నరేంద్ర, పాథాలజీ విభాగాధిపతి డా॥ రుగ్మంగద, ప్రొఫెసర్ ఆర్.ఓ. ఉపశమన సంరక్షణ విభాగాధిపతి డా॥ ప్రాణబంధు దాస్, కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డా॥ నాగరాజు, నర్సింగ్ కాలేజ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా॥ నాగరత్నమ్మ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ డా॥ బాలబాయ్ నానావతి హాస్పిటల్, ముంబాయి నుండి ఛైర్ ఓరేటర్‌గా చీఫ్ రేడియేషన్ ఆంకాలజిస్టు డా॥ నాగరాజ్ గురురాజ్ హులిగల్ రేడియేషన్ ఆంకాలజి రంగానికి విశేష సేవలు అందించారని వారి ప్రతిభను గుర్తించి ఓరేటర్‌గా ఈ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా రేడియోధార్మికతను అధిగమించడం –హైపర్థెర్మియా పాత్ర అనే అంశాలలో ఎన్నో పరిశోధనలు నిర్వహించారని జాతీయ స్థాయిలో ఆంకాలజి రంగంలో విశిష్ట సేవలందించారని తెలియజేశారు.డా॥ బాలబాయ్ నానావతి హాస్పిటల్, ముంబాయి నుండి ఛైర్ ఓరేటర్‌గా చీఫ్ రేడియేషన్ ఆంకాలజిస్టు డా॥ నాగరాజ్ గురురాజ్ హులిగల్ విచ్చేసి రేడియోధార్మికతను అధిగమించడం –హైపర్థెర్మియా పాత్ర అనే అంశంపై



వివరిస్తూ రేడియోధార్మికతను అధిగమించడం అంటే అస్థిర పరమాణు కేంద్రకాలు శక్తిని విడుదల చేసే ప్రక్రియను నియంత్రించడం లేదా క్యాన్సర్ వంటి వైద్య చికిత్సలలో కణాల నిరోధకతను అధిగమించడం, క్యాన్సర్ చికిత్స (రేడియోరెసిస్టెన్స్) వైద్య రంగంలో, క్యాన్సర్ కణాలు రేడియేషన్‌కు చూపుతున్న నిరోధకతను అధిగమించడానికి, ఇది రోగనిరోధక కణాలను ఉత్తేజపరిచి, 40-46 డిగ్రీ వద్ద క్యాన్సర్ కణాలను నాశనం చేసే ప్రక్రియలను ప్రేరేపిస్తుందని, కాలేయ నష్టం వంటి కొన్ని వ్యాధుల తీవ్రతలో కూడా ఇది పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అధిక వేడి కణితి కణాలను నేరుగా చంపుతుంది మరియు కణితి సూక్ష్మ వాతావరణాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఇంట్రాపెరిటోనియల్ కెమోథెరపీ మరియు మాగ్నెటిక్ హైపెథెర్మియా వంటి పద్ధతులలో కీమోథెరపీ మందుల ప్రభావాన్ని పెంచడానికి ఉపయోగిస్తారు కణితి లోపలికి ఔషధం చొచ్చుకుపోయే సామర్థ్యాన్ని పెంచుతుంది ఈ ప్రక్రియలో కణితి కణాలను వేడి చేయడం ద్వారా, ఇది సాధారణ కణజాలాలను కాపాడుతూనే క్యాన్సర్ నివారణకు సహాయపడుతుందని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్ ముఖ్య అతిథి డా॥ నాగరాజ్ గురురాజ్ హులిగల్ గారిని గోల్డ్ మెడల్ తో సత్కరించి, జ్ఞాపికను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ.ఎం.ఎ ప్రెసిడెంట్ డా॥ ఎఆర్ రెడ్డి, రుయా మాజీ సూపరింటెండెంట్ డా॥ భారతి, స్విమ్స్ సర్జకల్ గ్యాస్టోఎంట్రలజీ విభాగాధిపతి డా. శివరామ్, ఆర్. ఎం. ఓ డా. కోటిరెడ్డి, రేడియేషన్ వైద్యులు డా॥ శ్రీనివాస్, డా॥ దీప్తి మరియు రేడియేషన్, సర్జికల్, మెడికల్ ఆంకాలజి విభాగాల వైద్యులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 70 ఏళ్లగా సొంత విద్యుత్ కార్యాలయము లేని సూళ్లూరుపేట మున్సిపాలిటీ పట్టణం




ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట




తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం అలనాడు పంచాయతీతో రూపుదిద్దుకున్న సూళ్లూరుపేట చిమ్మ చీకట్లో బుడ్డి దీపాలతో, ప్రభుత్వ కార్యాలయాలు,వ్యాపారులు ప్రభుత్వ పాఠశాలలు గ్రామ ప్రజలు జీవనం సాగించేవారు పంచాయతీ అభివృద్ధి చెందాలి అంటే మెరుగైన వసతులు కావాలని ఆనాటి పంచాయతీ ప్రెసిడెంట్ ప్రభుత్వాన్ని ఒప్పించి 1956 ఫిబ్రవరి 17 తారీకున పంచాయితీ ప్రెసిడెంట్ కాళంగి రాజగోపాల చెట్టి ఆధ్వర్యంలో అప్పటి ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి చేతులు మీదుగా మహదేవయ్య నగర్ ఏరియాలో ట్రాన్స్ఫారం ప్రారంభించారు. మరుసటి రోజు ఫిబ్రవరి 18 తారీఖున గృహ వినియోగదారులకు 41 మందికి, వ్యాపార వినియోగదారులకు 12 మందికి కనెక్షన్లు మంజూరు అయినాయి అప్పటినుండి నుండి విద్యుత్ సరఫరా వినియోగంలోకి వచ్చింది ఆనాడు పంచాయతీ లో దశలవారీగా ఎనిమిది వేల పైచిలుకు కనెక్షన్లతో విద్యుత్ వినియోగం పెరిగింది తదుపరి కోటపోలూరు, మున్నార్ పోలూరు ఏరియాలకు కూడా సూళ్లూరుపేట నుంచి విద్యుత్ ప్రారంభమైంది, ఈరోజు సూళ్లూరుపేట మున్సిపాలిటీ పట్టణముగా అభివృద్ధి చెంది 26,800 విద్యుత్ సర్వీసులు 382 ట్రాన్స్ఫార్మర్ల, ఐదు సబ్ స్టేషన్లు కలిగి 70 సంవత్సరాలు చరిత్ర కలిగిన విద్యుత్ రెవిన్యూ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం దురదృష్టకరం, ఒకప్పుడు విద్యుత్ సర్వీస్ కావాలన్నా విద్యుత్ ఛార్జి సకాలంలో చెల్లించకపోయినా నాయుడుపేట వెళ్లి చెల్లించి రావాల్సి ఉండేది కానీ 2006 ఆనాటి సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యుని చొరవతో సూళ్లూరుపేటలో విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని అద్దె భవనంలో ప్రారంభించారు, విద్యుత్ కార్యాలయం ఒక్కొక్క సంవత్సరానికి ఒక్కొక్క ఏరియాలో అద్దె భవనాలకు మారటం వలన వినియోగదారులకు ఇబ్బందికరంగా ఉందంటు పట్టణ ప్రజలు వాపోతున్నారు , వాణిజ్యపరంగా కూడా అభివృద్ధి చెందుతున్న పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న సొంత విద్యుత్ భవనానికి చుక్కెదిరవుతుంది,విద్యుత్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణానికి ఏనాడు స్థలాన్ని కేటాయించింది ప్రభుత్వం, నాయకుల మాయాజాలంతో నేడు ఉన్నటువంటి ఆర్టీసీ డిపో ఆనాడు విద్యుత్ కార్యాలయాలు కేటాయించిన స్థలం సొంత విద్యుత్ కార్యాలయము లేక అద్దె భవనంలో విధులు నిర్వహించడం విడ్డూరంగా ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎంతమంది అధికారులు మారినా గుర్తుకు రాని సమస్యగా నిలిచిపోయింది ఇకనైనా విద్యుత్ కార్యాలయం కు సొంత స్థలం ఏర్పాటు చేసి సొంత విద్యుత్ కార్యాలయము నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## మామండూరు అటవీ ప్రాంతంలో ఈతకు వెళ్లి యువకుడు మృతి



ప్రజా భూమి ప్రతినిధి -రేణిగుంట

మామండూరు పర్యాటక కేంద్రానికి చెన్నైకి చెందిన శ్రీనివాసన్ ,అతని స్నేహితుడు మణికంఠన్ వయస్సు 27 సంవత్సరాలు ఇద్దరూ చెన్నైలోని ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. చెన్నై నుండి బైక్‌పై బయలుదేరి మామండూరు అటవీ ప్రాంతానికి విహారయాత్ర కోసం చేరుకున్నారు. అక్కడ ప్రవేశ టికెట్లు తీసుకుని జలపాతం ప్రాంతానికి వెళ్లారు. మణికంఠన్ ఈత కొట్టేందుకు జలపాతం వద్ద నీటిలోకి దిగినప్పుడు అనుకోకుండా సుమారు 8 అడుగుల లోతు గల నీటి గుంటలో మునిగి పోయాడు. మణికంఠన్‌కు ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానిక ప్రజల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ సంఘటనపై రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి పోలీసులు కేసు విచారిస్తున్నారు.

## పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదు

### తొండూరులో అభివృద్ధి పనులను పరిశీలించిన బి.టెక్ రవి

ప్రజాభూమి, పులివెందుల



తొండూరు మండల కేంద్రంలో శనివారం తెలుగు దేశం పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి పర్యటించి, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తొండూరు గుండా వెళ్తున్న నేషనల్ హైవే (ఎన్ హెచ్) రోడ్డు విస్తరణ పనులను తొండూరు మండల టీడీపీ ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి, వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి తో సహా పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు నాణ్యతతో జరగాలని, ప్రయాణికులకు , స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన ఈ పనులను పూర్తి చేయాలని గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని ఎస్సీ కాలనీని సందర్శించి అక్కడి దుర్భరమైన డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. కాలువలు పూడికపోయి, మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుండటం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే ఎస్సీ కాలనీలో పూడికతీత పనులు చేపట్టి, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి మార్గం సేవా పథం

ప్రజా భూమి తొండూరు :

మానవ సేవకు ప్రేరణనిచ్చే పవిత్ర మాసం రంజాన్న మిగిలిన పండుగలతో పోల్చితే రంజాన్ కు విశిష్టత ఉంద్ని ఏడాదిలో ఈ నెల ఎప్పుడు వస్తుందా అని ముస్లిం సోదరులు ఎదురు చూస్తార్ను రంజాన్ మాసం ప్రారంభం కావడంతో తెల్లవారుజామునే ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టామన్నార్ను నెల రోజులు ఉపవాస దీక్షలో శరీరాన్ని శుష్కింపతేయడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుందని నమ్మకం రోజులో సుమారు 14:30 గంటలపాటు కనీసం గుక్కెడు నీళ్లు కూడా నెల రోజులు కఠోర ఉపవాస దీక్ష చేపడతార్ను

## శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు "గల్లా జయదేవ్" , ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ " విపిన్ కుమార్"

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నివాసానికి విచ్చేసి విందులో పాల్గొన్నారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తికి ఎప్పుడు వచ్చిన దర్శనార్థం వచ్చినా మా అన్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి గృహంలో విందు స్వీకరించడం తనకు



సాంప్రదాయంగా మారిందని, "మా అన్న ఇంటికి వచ్చినట్టే అనిపిస్తుంది" అని కేంద్ర మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు కేంద్ర మంత్రిని ఆప్యాయంగా పలకరించి, సాదరంగా విందు ఏర్పాటు చేశారు. అన్నదమ్ముల వలే పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకుంటూ, కలిసిమెలిసి గడిపిన ఈ భేటీ స్నేహభావాన్ని ప్రతిబింబించింది.శ్రీకాళహస్తి ఆతిథ్య సంప్రదాయాన్ని ప్రతిబింబించిన ఈ విందు కార్యక్రమం ఆప్యాయత, అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది.

## విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందించాలి

### మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్


ప్రజాభూమి, హిందూపురం టౌన్



విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించే విధంగా అటు ఉపాధ్యాయులు ఇటు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని చైతన్య పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ మీట్ ను క్రీడాజ్యోతి వెలిగించి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువు తో పాటు క్రీడలు చాలా అవసరం ఉందన్నారు. ప్రతిరోజు క్రీడలు అలవాటు చేయాలని, ఉపాధి, ఉన్నత చదువులలో క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పరిపాలనాధికారి ప్రభాకర్ రెడ్డి, డీన్ నాగరాజు, ప్రీ ప్రైమరీ ఇంచార్జి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆసుపత్రులతో ప్రజారోగ్యానికి బాసటగా కూటమి ప్రభుత్వం -ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.



పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, ప్రభుత్వాసుపత్రుల్లో వ్యర్థాల నిర్వహణ పక్కాగా జరగాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. శనివారం ఆయన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో వ్యర్థాల నిర్వహణ విధానాలను అక్కడ విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను, సిబ్బందిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను స్వచ్ఛంగా ఉంచాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. బయోమెడికల్ వ్యర్థాల ట్రాకింగ్ కి సంబంధించిన బార్ కోడ్ ఆధారిత సిస్టమ్ ని పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలోని శుభ్రత ప్రమాణాలపై ఆరా తీశారు. వారంతా ఎమ్మెల్యే వద్ద ఆసుపత్రి పరిశుభ్రతపై సంతృప్త వ్యక్తం చేసారు.

# స్వచ్ఛ రథం ప్రారంభం.. స్వచ్ఛ రథం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో వ్యర్థాలను సేకరణ

## ప్రజలు సద్వినియోగం చేసుకొని..పరిసరాల పరిశుభ్రతకు సహకారం అందివ్వాలి..





ప్రజా భూమి బ్యూరో అన్నమయ్య

గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రత కు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు యనమల మదనమోహన్, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ మండల అభివృద్ధి అధికారి రెడ్డయ్య లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం గంగమ్మ తల్లి దేవస్థానం వద్ద ఏర్పాటు చేశారు. మార్కెట్ చైర్మన్ షఫీ నాయక్,ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు,టిడిపి నాయకులు ఉమాపతి రెడ్డి,మండల అధికారి రెడ్డన్న,అంగన్వాడీ సూపర్ వైజర్లు కలిసి మండల అధ్యక్షులు యనమల మదన్ మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలలో మండల అధికారులు, ఐసిడిసి సూపర్వైజర్లు, టిడిపి శ్రేణులు పరి శుభ్రత కార్యక్రమం తో పాటు ప్రతిజ్ఞ నిర్వహించారు.అనంతరం స్వచ్ఛ రథం ను ప్రారంభించి దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ స్వచ్ఛ రథం గ్రామాలలో వెళ్లి తడి చెత్త పొడి చెత్త తదితర వ్యర్థాలను సేకరించి వాటి తగ్గట్టుగా ధరలు నిర్ణయించి సరుకులను ప్రజలకు అందజేస్తారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రతి గ్రామీణ ప్రాంతం స్వచ్ఛగా ఉండాలని ఉద్దేశంతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ కార్యక్రమాన్ని కి శ్రీకారం చుట్టిందన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి సోదరుల నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి,టిడిపి యువ నాయకులు మౌర్యా రెడ్డి ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి మండలం అన్ని రంగాలలో అభివృద్ధి పరిచినకు కృషి చేస్తున్నట్లు యనమల మదనమోహన్ తెలియజేశారు... ఈ కార్యక్రమంలో అనంతపురం గ్రామ అధ్యక్షులు సహదేవ,సింగల్ విండో ప్రెసిడెంట్ దేవానంద రెడ్డి,పాపయ్య, రెడ్డప్ప రెడ్డి, చింతకుంటపల్లె బాబు, బిజెపి కృష్ణ,శంకర్, కిరణ్, రామాంజనేయులు, డీలర్ అన్వర్, మాక్బూద్,రిజ్వాన్, దేవానంద రెడ్డి, ముక్తార్ అహ్మద్, బోనాల ధన, ఆర్కే హేమంత్, తదితరులు పాల్గొన్నారు

# స్వచ్ఛ్ ఆంధ్ర ఆరోగ్య ఆంధ్ర

### - డి ఎం హెచ్ ఓ డాక్టర్ కె నాగరాజు



ప్రజా భూమి,కడప సిటీ :

ప్రతినెల మూడవ శనివారంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలు, కార్యాలయ ఆవరణం, కార్యాలయంలోని అన్ని విభాగాల ఇబ్బంది స్వచ్ఛ్ ఆంధ్రలో భాగంగా ఆఫీసు ప్రాంగణ పరిసరాల పరిశుభ్రము చేసుకోవడం జరిగినది.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బందిచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి క్లీన్ అండ్ గ్రీన్ ఆచరించవలసిందిగా తెలియజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటాం, అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండుటకు దోహదం చేయునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ ఏ. ఉమామహేశ్వర్ కుమార్, ఆర్.బి.ఎస్.కె. నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆరిఫుల్లా, ఎన్.హెచ్.ఎం. నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె. ప్రవీణ్ కుమార్, జిల్లా మలేరియా అధికారిని శ్రీమతి మనోరమ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను రెగ్యులరైజ్ చేయాలి



ప్రజాభూమి, సిద్దవటం:

సమగ్ర శిక్షా అభియాన్ కింద రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్, డాన్స్ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి, వారిని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం సిద్ధవటంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు ఈ అంశంపై గళమెత్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హాజిమలింక్, రాష్ట్ర కోశాధికారి చిన్న వెంకటయ్య మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఇన్‌స్ట్రక్టర్ల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఇన్‌స్ట్రక్టర్లకు ఉద్యోగ భద్రతతో పాటు రెగ్యులరైజేషన్, వైద్య సదుపాయాలు, వివిధ భత్యాలు మరియు పీఎఫ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇదే తీర్పును ప్రాతిపదికగా తీసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తక్షణమే నిర్ణయం తీసుకోవాలి. ఇదే విషయంపై ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ కాపీతో కూడిన వినతిపత్రాన్ని అందజేశామని నాయకులు తెలిపారు. అధికారుల నుంచి సానుకూల స్పందన లభించిందని, త్వరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో, ఎలాంటి భద్రత లేకుండా పనిచేస్తున్న వేలాది మంది ఇన్‌స్ట్రక్టర్ల కుటుంబాల్లో ఈ తీర్పు కొత్త ఆశలు చిగురింపజేసిందని, ప్రభుత్వం ఉదారతతో వ్యవహరించి తమకు న్యాయం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర పిటిఐ సంఘం నేతలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# మాజీ సీఎంకు జగన్మోహన్ రెడ్డి కి వివాహ పత్రిక అందజేసిన మాజీ చైర్మన్



ప్రజాభూమి, పులివెందుల

సింహాద్రిపురం మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వెన్నపూస రామ్మోహన్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ సర్పంచ్ లక్ష్మీపద్మజ లు శనివారం తాడేపల్లి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డిని కలిసి వివాహ పత్రికను అంద జేశారు. ఈ సందర్భంగా మా కుమార్తె రేణుక రెడ్డి ,రాహుల్ రెడ్డి ల వివాహ వేడుకలు మార్చి 6 న కదిరి రోడ్డులోని ఎస్ సి ఎస్ ఆర్ కళ్యాణమండపంలో జరగబోయే వివాహ వేడుకలకు తప్పకుండా హాజరు కావాలని వారు ఆయనకు వివాహ పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి తప్పకుండా వివాహ వేడుకలకు హాజరవుతానని వారికి తెలిపారు. అంతకుముందుగా ఆయనను కలసి పూల బొకే ను వారు అందజేశారు.

# మాతృభాష తెలుగును రక్షించుకోవడం మనందరి బాధ్యత

### - కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ డా. ఎన్.తులసి రెడ్డి



ప్రజాభూమి, కడప సిటీ:

శ్వాస, భాష ఒకటే, శ్వాస ఆగితే మనిషి చస్తాడు, భాష ఆగితే జాతి చస్తుందని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు.అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శనివారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ట్రిపుల్ ఐటీలో తెలుగు ప్రొఫెసర్ గా పని చేస్తున్న సుధా , వేంపల్లి బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న శశికళ, ఉషారాణిలను, వేంపల్లి ఉర్దూ హైస్కూల్లో తెలుగు టీచర్ గా పని చేస్తున్న శ్రీలక్ష్మి , పాములూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో తెలుగు టీచరుగా పనిచేస్తున్న శ్రీనివాసులును శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మనుషుల మధ్య అనుబంధాలను పెంచడంలో మాతృభాష ప్రముఖ పాత్ర వహిస్తుంది అన్నారు.మాతృభాష తల్లిపాలతో సమానం కాగా ఇతర భాషలు పోతపాలతో సమానం అన్నారు. మహాత్ముడు,రవీంద్రుడు, అబ్దుల్ కలాం ,అంబేద్కర్ తదితర పెద్దలందరూ ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలని చెప్పారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైకాపా ప్రభుత్వం జీవో 85 జారీ చేయడం ఒక చారిత్రిక తప్పిదం.ఆ జీవోను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కొనసాగించడం మరింత శోచనీయం. తెలుగు భాష మన అందరి వారసత్వపు ఆస్తి. దీనిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి,తులసి రెడ్డి సతీమణి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ,బద్రీనాథ్, రాఘవయ్య , శేఖర్, వేమయ్య రవి తదితరులు పాల్గొన్నారు .

# బాధ్యులు క్షమాపణ చెప్పాలి

### జనసేన పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్



ప్రజాభూమి, కడప సిటీ:

శాసన మండలిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇంచార్జ్ సుంకర శ్రీనివాస్ స్పందించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలకు సంబంధించిన వ్యవహారం, తిరుమల లడ్డు పవిత్రతపై వచ్చిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. తిరుమల తొలి గడపగా పేరుగాంచిన దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం భారతీయ సంస్కృతికి మూలస్థంభమని, శ్రీ వెంకటేశ్వర స్వామి కోట్లాది మంది ఆరాధ్య దైవమని తెలిపారు. తిరుమల లడ్డు కేవలం ప్రసాదం మాత్రమే కాకుండా భక్తి, విశ్వాసాలకు ప్రతీక అని అన్నారు. ధార్మిక విశ్వాసాలకు సంబంధించిన అంశాలను రాజకీయ వివాదాలుగా మార్చడం తగదని, సంబంధిత నాయకులు భక్తులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు సంయమనం పాటిస్తూ ప్రజల విశ్వాసాలను గౌరవించాలన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సనాతన ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంజన్న ఆలయంలో విశేష పూజలు




ప్రజాభూమి, పులివెందుల టౌన్

సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాఘమాసం సందర్భంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనా మార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైంకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలు

### -ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే

### -ఆర్ సి డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ప్రజాభూమి,పులివెందుల

నేడు భారత స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179 వ వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని స్థానిక మోర్ సూపర్ మార్కెట్ ( పాత జీవుల బస్టాండ్) సమీపంలో ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ సి డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచర్ల సర్వోత్తమ్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునిసిప ల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, తొండూరు మండల ఇంచార్జ్ వైఎస్ మదన్ మోహన్ రెడ్డి పాల్గొననున్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ హాజరై మహావీరుడికి ఘన నివాళులు అర్పించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మొన్న ధీమాగ్గా నేడు దిగాలుగా



ప్రజా భూమి తొండూరు :

ఈ సంవత్సరం రాత్రి ఉష్ణోగ్రత తక్కువగా ఉండటంతో మామిడి చెట్లకు పూత బాగా వచ్చింద్ని ఈసారి కాత ఎక్కువగా ఉంటుందని రైతులు భావించార్ను అయితే గత నెల రోజులుగా వాతావరణం వైవిధ్యంతో మామిడి పుష్పించే సమయంలో తామర పురుగుల సమస్య ఎక్కువైంద్ని దీంతో కొమ్మలకు బూజుపట్టి పిందెలు,లేత మామిడి కాయలు రాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నార్ను

# ఇక మగపిల్లలకి పెళ్లిళ్లు అయినట్టే



ప్రజా భూమి తొండూరు :

1980 వరకు మగపిల్లలకి పెళ్లి అవ్వాలంటే మినిమం ప్రభుత్వ ఉద్యోగమో,లేక బ్యాంకులో జాబ్ ఉండాల్సిన పరిస్థిత్ని దాంతో పాటు అబ్బాయి వైపు నుంచి కట్నకానుకల డిమాండ్స్ ఎలాగూ ఉండేవ్ని 1990ల తర్వాత గాలి అమెరికా వైపుకు వీయడం మొదలుపెట్టింద్ని అమ్మాయిల ఆలోచనల్లో ఇండియా లోనే ఉండే పెద్ద ఉద్యోగం వాడికంటే అమెరికా భర్త అయితే బాగుంటుందని కోరుకోవడం ఎక్కువయ్యింద్ని కట్నాలు కూడా దానికి తగ్గట్టే ఉండేవ్ని క్రమంగా రోజులు మారుతూ వచ్చాయ్ని "మంది ఎక్కువైతే మజ్జిగ పలచన" అన్నట్టుగా వీధికోక మగపిల్లాడు అమెరికాలో ఉండడం వల్ల, కేవలమ్ని ఎన్నారై స్టాటస్ కాకుండా,అబ్బాయి ఆస్తిపాస్తులుంటేనే పెళ్లికి ఒప్పుకునే అమ్మాయిలు బయలుదేరార్ను అమ్మాయిల సంఖ్య పెరిగి,అబ్బాయిల సంఖ్య తగ్గడంతో కట్నాల డిమాండ్ కూడా తగ్గుతూ వచ్చాయ్ని "మంచి అమ్మాయి దొరికితే చాల్ను కట్నాల అక్కర్లేద"నే రోజులు వచ్చాయ్ని దాంతో అమ్మాయిలకే డిమాండ్ పెరిగింద్ని వరకట్నాలు పోయి కన్యాశుల్కం రోజులు ఇంకా రాలేద్ను కానీ కట్నాలు డిమాండ్ చేసే వరులు మాత్రం తగ్గార్ను

# ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

### - ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. శనివారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ఎస్. నాగేంద్ర పాల్గొని, అమ్మ ఒడిలో నేర్చుకునే భాషే మాతృభాష, అందుకే దానిని అమ్మతో పోలుస్తారు అని తెలిపారు. అనంతరం తెలుగు శాఖ అధ్యక్షులు డా.ఎల్.నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ మన భావాలను హృదయానికి హత్తుకునేలా వ్యక్తపరచడానికి మాతృభాషే ఉత్తమ సాధనమని, మాతృభాషలో చదవడం, విద్యాబోధన వల్ల మానసిక వికాసం, సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయ "దేశభాషలందు తెలుగు లెస్స" అనే వాక్యాన్ని ప్రస్తావించారు. అలాగే చరిత్ర అధ్యాపకుడు డా. బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో కొంతమంది ఆంగ్ల భాష ప్రభావంలో మాతృభాషను వదిలేస్తున్నారని, భాష--సంస్కృతులు పరస్పరం ముడిపడి ఉంటాయని చెప్పారు. లైబ్రరీ సైన్స్ విభాగాధ్యక్షులు డాక్టర్ పొట్లన్నగారి మాధవరావు మాట్లాడుతూ భాష సరిహద్దుల్లో పరిమితం అయ్యే అంశం కాదని, అది కన్నతల్లిలాంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా.మల్లేశ్వరమ్మ, షఫీద్దీన్, అరవింద్, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీటీ కళాశాల మైదానంలో మరిన్ని వసతులతో అభివృద్ధి -జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



ప్రజా భూమి బ్యూరో అన్నమయ్య

బిటి కళాశాల మైదానంలో మరిన్ని వసతులతో అభివృద్ధి జరగనుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాషా తో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బిటి కళాశాల మైదానాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... బిటి కళాశాల మైదానంలోకి ఎంతోమంది యువతీ యువకులు, వయసు పైబడిన వారు వస్తారని ఈ మైదానాన్ని మరిన్ని వసతులతో అభివృద్ధి చేయనున్నామన్నారు. మైదానంలోకి వచ్చే వారికి అవసరమయ్యే వసతులపై దృష్టి పెట్టి మైదానాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష మాట్లాడుతూ... మదనపల్లి పట్టణానికి ఎంతో ముఖ్యమైన బీటీ కళాశాల మైదానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్ కృషి చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మదనపల్లి పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

**-పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండాలి**

**-దొంగతనాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించిన ఎస్ఐ మధుసూదన్ రెడ్డి**



ప్రజాభూమి పులివెందుల

పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ సమీపంలో ఉన్న బస్సు స్టాప్ పార్నపల్లి రోడ్డు లో ఉన్న బస్సు స్టాప్ , కడప రోడ్డులో ఉన్న బస్సు స్టాప్ లోని ప్రయాణికులకు పులివెందుల డి.ఎస్.పి మురళి నాయక్ ఉత్తర్వుల మేరకు సీఐ సీతారామి రెడ్డి చూచనలతో ఎస్సై మధుసూదన్ రెడ్డి దొంగతనాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ మీకు పరిచయం లేని వారితో మాట్లాడకూడదన్నారు. మీరు తీసుకెళ్లే లగేజ్ లు బ్యాగులు మీ వద్ద జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అపరిచితులు ఆడవారు గానీ, మగవారు గాని ఏవైనా ఇస్తే వాటిని తీసుకొని తినడం లాంటివి చేయకూడ దన్నారు. ఎవరి మీద అయినా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందజేయాలని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ధ్రువకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

### మానసిక వికలాంగులకు అన్నదానం



ప్రజాభూమి,పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి 33 వజన్మదిన పురస్కరించుకొని, పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పులివెందుల పట్టణ అధ్యక్షుడు బోనాల ఖాదర్ వలీ, పులివెందుల మండల అధ్యక్షులు శివ కళ్యాణ్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రాయపాటి రాజా ఆధ్వర్యంలో ధ్రువ కుమార్ రెడ్డి జన్మదిన కేకును కట్ చేసి నాయకు లకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం పార్నపల్లి రోడ్డు లోని మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్రువ కుమార్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాల తో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవా లని ఆకాంక్షిస్తున్నట్లు వారు తెలిపారు. వైయస్ షర్మిలా రెడ్డి, జ్యోతి,తులసి రెడ్డి ల ఆశీస్సులతో ఇంకా మంచి పదవులను అధిరోహించాలని దేవుని కోరుకుంటున్నాట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు చంద్రబాబు, ప్రభావతి ,భాగ్యలక్ష్మి ,శిరీష ,సాయి, బాషా, సందీప్, రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు కొత్త దిశగా అడుగులు



ప్రజాభూమి ,వేముల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యంఈ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి సోదరుడు పేర్ల శేషా రెడ్డి , ఎంపీడీవో గంగాదేవి , డీడీఓ విజయలక్ష్మి జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు ఇనుము, ప్లాస్టిక్, గాజు సీసాలు వంటి పొడి చెత్తను స్వచ్ఛ రథం,వాహనానికి అందిస్తే, అందుకు ప్రతిఫలంగా తగిన వంట వస్తువులను అందజేస్తామని తెలిపారు.చెత్తను వర్గీకరించి ఇవ్వడం ద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉండటమే కాకుండా, ప్రజలకు ఉపయోగకరమైన ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని చెప్పారు.ప్రజల భాగస్వామ్యంతో మరింత స్వచ్ఛంగా, ఆరోగ్యకరంగా మారాలని నాయకులు ఆకాంక్షించారు

# దివిసీమ మహోన్నత వారసత్వం నిలిపేలా ఎదగాలి





## ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ ప్రజా భూమి ప్రతినిధి:

నేటి విద్యార్థులు దివిసీమ మహోన్నత వారసత్వం నిలిపేలా ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం అవనిగడ్డలోని ప్రభుత్వ హైస్కూలులో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం, స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిపూర్ణ విజ్ఞానవంతుడు కావాలన్నారు. మాతృభాషలో ప్రతి ఒక్కరూ పరిపూర్ణులు కావాలన్నారు.

భాష మరుగున పడితే, భావితరాలు అక్షరాలు నేర్వని జాతిగా మారితే వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం కూడా మరుగున పడుతుందన్నారు. 2500 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు భాష ఖ్యాతిని నేటి విద్యార్థులు నిలపాలని పిలుపునిచ్చారు. అంత ర్జాతీయ భాష ఇంగ్లీష్, జాతీయ భాష హిందీ ప్రతి ఒక్కరూ నేర్చుకుంటూనే, మాతృ భాష తెలుగు రాయడం, చదవటం తప్పనిసరిగా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర నినాదం అందుకుని పాఠశాల పరిశుభ్రతకు ప్రతి విద్యార్థి బాధ్యత వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులచే ఎమ్మెల్యే స్వయంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఎంపీడీఓ మరియాదేవి, ఎంఈఓ అన్నపరెడ్డి పిచ్చియ్య, హెచ్ఎం కందుల సుజాత, ఉపాధి పథకం ఏపీఎం రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలలు ఆధునిక, ప్రాచీన కవులు రచయిత్రుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణ ప్లకార్డులు ప్రదర్శించారు.



## దుర్గమ్మ ఆలయ ఈవో శ్రీ సీనా నాయక్ స్వయంగా అన్న ప్రసాదం స్వీకరణ

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ




విజయవాడ దుర్గమ్మ అన్నప్రసాదం ఆలయ ఈవో శ్రీ సీనా నాయక్ స్వయంగా అన్న ప్రసాదం స్వీకరణ, ఏ ఈ ఓ సుధారాణి పర్యవేక్షణలో భక్తుల మనో భావాలుఅద్భుతమైన రుచి: "అమ్మ వారి ప్రసాదం అమృతంలా ఉంటుంది" అని భక్తులు తరచుగా చెబుతుంటారు. ముఖ్యంగా ఇక్కడ వడ్డించే పప్పు, సాంబార్ మరియు పులిహోర రుచి మరువలేనిదని అనేకమంది భక్తుల అభిప్రాయం. శుచి మరియు శుభ్రత: అన్నదాన హాల్ (మహా మండపం 3వ అంతస్తు) ఎంతో విశాలంగా, పరిశుభ్రంగా ఉంటుందని భక్తులు ప్రశంసిస్తున్నారు. వడ్డించే విధానం కూడా ఎంతో క్రమశిక్షణతో కూడి ఉంటుంది.నిరంతర సేవ: ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నిరంతరాయంగా భక్తులకు భోజన సౌకర్యం కల్పించడం పట్ల యాత్రికులు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సేవా భావం: ఎటువంటి వివక్ష లేకుండా వేలాది మందికి ప్రతిరోజూ ఉచితంగా భోజనం అందించడం ఒక గొప్ప సామాజిక సేవగా భక్తులు కొనియాడుతున్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన పథకం ఆవిష్కరణ

### బ్యాంకు ఉద్యోగులు భారీ ర్యాలీ...



ప్రజాభూమి ప్రతినిధి,
మచిలీపట్నం ప్రతినిధి:




దేశవ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 444 అనే పేరుతో నూతన పథకంను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ కే వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం నగరంలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రీజనల్ మేనేజర్ వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారుల కోసం 444 అనే డిపాజిట్ పథకమును తీసుకువచ్చిందని అన్నారు. ఈ డిపాజిట్ పథకం ద్వారా సీనియర్ సిటిజన్స్ 7.10, సూపర్ సీనియర్స్ కోసం 7.35 వడ్డీరేట్లతో 444 రోజుల్లో స్వల్ప కాలంలోనే అధిక వడ్డీ ఇస్తుంద న్నారు. ఈ డిపాజిట్ పథకం పై ప్రజలకు అవగాహన కల్పించడానికి యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు నగరంలో కోనేరు సెంటర్ నుండి రాజా గారి సెంటర్,రేవతి సెంటర్, బస్టాండ్ సెంటర్, జిల్లా కోర్ట్, లక్ష్మి టాకీస్, జిల్లా పరిషత్ సెంటర్ల మీదుగా భారీ ర్యాలీ నిర్వ హించి కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పథకంపై బ్యాంకు సిబ్బంది విస్తృత ప్రచారం చేస్తున్నారు.

## గంజాయి మత్తులో యువకులు హల్చల్

### ట్యూబ్ లైట్ తో స్నేహితుడిని పొడిచిన వైనం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం ప్రతినిధి:



చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధి ఈడేపల్లి ప్రాంతంలో ఇద్దరు యువకులు గంజాయి మత్తులో ట్యూబ్ లైట్ పగలగొట్టి సాయి గణేష్ అనే వ్యక్తిని పొడిచిన ఘటన స్థానికంగా సంచన సృష్టించింది. సేకరించిన వివరాలు ప్రకారం ఈడేపల్లి ప్రాంతంకు చెందిన సాయి గణేష్ ,సోమశేఖర్ ,కన్నా అనే వ్యక్తులు గతంలో స్నేహితులుగా ఉండేవారు సాయి గణేష్ అనే వ్యక్తి చదువు కుంటూ ఉండటంతో దురాలవాట్లు ఉన్న సోమశేఖర్, కన్నాలకు దూరంగా ఉంటున్నాడు. దీనితో పగ పెంచుకున్న యువకులు , ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించడానికి వెళ్తున్న సాయి గణేష్ ను అడ్డగించారు. యువకులు తమతో తిరగడం లేదు అని సాయి గణేష్ తో ఘర్షణ పడ్డారు. దీనితో మాటా మాటా పెరిగి సోమశేఖర్, కన్నా లు సాయి గణేష్ పై దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో ఆ ఇద్దరు యువకులు పక్కనే ఉన్న ట్యూబ్ లైట్ ను పగలగొట్టి సాయి గణేష్ ను పొడిచారు. దీనితో గాయాలైన సాయి గణేష్ ని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి గాయానికి ఆరు కుట్లు వేశారు. సాయి గణేష్ కుటుంబ సభ్యులు గంజాయి మత్తులోనే తమ కుమారుడను ట్యూబ్ లైట్ తో పొడిచారని ఆరోపించారు. పోలీసులు సాయి గణేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఏపీలో మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

ఏపీలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. 12:30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. పదో తరగతి పరీక్షలు జరిగే కేంద్రాలలో మాత్రం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు .తెలంగాణలోనూ ఇదే తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి

## ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు సమయాన్ని హాజరుకండి

ప్రజాభూమి ప్రతినిధి కాకినాడ



ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి సమయానికి పరీక్షలకు హాజరై, చక్కగా పరీక్షలు రాసి, విజయం సాధించాలి- కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఈనెల 23 తేది నుంచి నుంచి ప్రారంభం కానున్న దృశ్య ఇంటర్మీడియట్ వ్రాత పరీక్షల సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్ మరియు సోలార్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బంది, అభ్యర్థులు సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిహెచ్ఎండి, హెచ్ హెచ్ ఎం డి లతో తనిఖీలు నిర్వహిస్తూ పరీక్షలు పూర్తయ్యే వరకు విధులలో ఉప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులకు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ ఈ వ్రాత పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తును, కట్టుదిట్టమైన ఏర్పాట్లను జిల్లా పోలీసు వారు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షలు పూర్తయ్యేవరకు అధికారులు మరియు సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి. పరీక్షా కేంద్రాల వద్ద తప్పక ఈ క్రింది నియమ నిబంధనలు పాటించవలెను.అభ్యర్థులకు నిర్దేశించిన సమయం ఉదయం 8:30 గంటల లోపు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవలెను.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అభ్యర్థుల సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించబడవు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వెయ్యవలెను. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొనబడును. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయరాదని ఎస్పీ హెచ్చరించారు.



## ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో రోడ్డు నిర్మాణం

### మల్లాయి చిట్టూరు రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

అవనిగడ్డ ప్రజాభూమి ప్రతినిధి

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో గత ఐదు సంవత్సరాలుగా రహదారి గోతులు పడి ఇబ్బందులు పడిన ప్రజలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కోటి రూపాయల నిధులతో పూషడం నుంచి మల్లాయి చిట్టూరు వరకు నూతన రహదారి నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ఆవుల రేవతి, నీటి సంఘం అధ్యక్షులు ఆవుల ధర్మ వెంకట నరసయ్యలు కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ వెంకట నరసయ్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఎమ్మెల్యే చొరవతో రహదారి నిర్మాణానికి అడుగులు పడ్డాయని తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతల నాగబాబు, వార్డు మెంబర్ నరహరశెట్టి విజయరాణి, పిఆర్ డిఈ పగడాల సురేష్, ఏఈ బ్రహ్మ నందబాబు, వసంతరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల

### - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి

అమరావతి ప్రజాభూమి ప్రతినిధి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ (GAIS) కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు జమ చేయబడినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## టీటీడీ నెయ్యి టెండర్ వ్యవహారంపై వన్‌మ్యాన్ కమిటీ నియామకం

అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి కల్తీ, నాసిరకం నెయ్యి సరఫరా జరిగినట్టు నమోదైన కేసు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వన్‌మ్యాన్ కమిటీని నియమించింది.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ (ఆర్ఆర్-1983)ను వన్‌మ్యాన్ కమిటీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన సెల్ఫ్ కంటెయిన్డ్ నోట్‌ను పరిశీలించి, నెయ్యి టెండర్ నిబంధనల సడలింపు, అమలు విషయంలో జరిగిన లోపాలు, నిర్లక్ష్యాలపై సంబంధిత కమిటీ సభ్యులు, సీనియర్ అధికారులపై తగిన చర్యలు సూచించాల్సిందిగా కమిటీకి బాధ్యతలు అప్పగించారు. ఈ కేసు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.470/2024గా నమోదు అయింది. ఈ వ్యవహారంపై విచారణను సుప్రీమ్ కోర్ట్ అఫ్ ఇండియా ఆదేశాల మేరకు డైరెక్టర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందానికి అప్పగించారు. సిట్ విచారణ పూర్తి చేసి 23.01.2026న చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో పాటు పరిపాలనా పరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.కమిటీ టెండర్ నిబంధనల అమలులో పరిపాలనా లోపాలు ఉన్నాయా లేదా పరిశీలించడంతో పాటు, నిర్ణయాలు నిబంధనల ప్రకారం తీసుకున్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తుంది. అవసరమైతే సంబంధిత అధికారుల బాధ్యతను గుర్తించి తగిన పరిపాలనా లేదా క్రమశిక్షణ చర్యలను సిఫారసు చేస్తుంది.కమిటీకి అవసరమైన రికార్డులు కోరే అధికారం ఉండగా, ప్రభుత్వ అనుమతితో నిపుణుల సహాయం తీసుకోవచ్చు. 45 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కమిటీ నివేదిక సిఫారసుల రూపంలో ఉండగా, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ఈ ఉత్తర్వులు ప్రభావం చూపవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## బహిరంగ వేలంపాట నిర్వహించిన దేవాదాయ శాఖ అధికారులు

### లంకమ్మ అమ్మవారి చీరల ఆదాయం 85000 రూపాయలు

అవనిగడ్డ ,ప్రజా భూమి ప్రతినిధి:

దివి సీమలో కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరజిల్లుతున్న అవనిగడ్డ గ్రామదేవత లంకమ్మ అమ్మవారికి మొక్కుబడులుగా సమర్పించుకున్న చీరలు ఘటం బిందెలు బహిరంగ వేలంపాట నిర్వహించగా 85000 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) చెప్పారు.. శుక్రవారం ఆలయ ఆవరణలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించగా చీరలకు 41485 రూపాయలు, ముక్కల చీరలకు 26000 రూపాయలు, చీరలకు 67485 రూపాయలు, 73ఘటం బిందులకు 17500 రూపాయలు మొత్తం కలిపి 84985 రూపాయలు వచ్చినట్లు చెప్పారు.. దేవాదాయ శాఖ అధికారిగా బొప్పన కోటేశ్వరరావు, ఆలయ చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, సభ్యులు తుర్లపాటి రామ్మోహన్రావు ఆలయ సిబ్బంది, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.




Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677